RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY


సంపుటి :18 | సంచిక : 287 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 23-8- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 287 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 23-8-2026 | PAGES: 8 | PRICE : 2/- RS



## అరోగ్యం బాలేకపోతే.. చాట్‌జీపీటీలో వెతికేస్తున్నారు.. - రాజ్‌నాథ్‌సింగ్

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**



అనారోగ్యానికి గురైతే వైద్యుడి వద్దకు వెళ్లకుండా ఇంటర్నెట్, చాట్‌జీపీటీ లో లక్షణాలను వెతికి.. తమకు ఫలానా వ్యాధి ఉందని నిర్ధారించుకోవద్దని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సూచించారు. అలా చూసుకునేవారి సంఖ్య దేశంలో రోజురోజుకీ పెరుగుతోందని తెలిపారు. శనివారం

తరువాయి 2లో..

## 75 దేశాలకు వీసాల నిలిపివేత కేసు.. ట్రంప్‌నకు కోర్టు షాక్

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**




అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు స్థానిక కోర్టులో షాక్ తగిలింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ ఇమిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని ఈ ఏడాది జనవరిలో ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం కొట్టేసింది. ఈ ప్రకటన ఫెడరల్ వలస చట్ట

తరువాయి 2లో..

## దౌత్యనీతి అంటే టీ20లే కాదు.. టెస్టులూ ఉంటాయి: జైశంకర్

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**



దౌత్యం, భౌగోళిక రాజకీయాలను ఎల్లప్పుడూ త్వరిత ఫలితాల దృష్టితో అంచనా వేయలేమని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. కొన్ని అంతర్జాతీయ సవాళ్లకు సహనం, దీర్ఘకాలిక నిబద్ధత అవసరమని చెప్పారు. 'ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరమ్'ను ఉద్దేశించి ఆయన

తరువాయి 2లో..

# విద్యార్థుల ప్రశ్నలు నారా లోకేశ్ జవాబులు..

### గంటా శ్రీనివాసరావు సమాధానం హైలైట్!

దివీస్ సహకారంతో ఆధునీకరించిన చంద్రంపాలెం స్కూల్ ప్రారంభం

విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఓపికగా సమాధానాలిచ్చిన లోకేశ్

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు ... ఇదే తమ సిద్ధాంతమన్న మంత్రి

మహిళల కోసం క్రీడల్లో 'షీ ప్లే' విధానం తీసుకొస్తామని వెల్లడి

చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావాలని విద్యార్థులకు పిలుపు

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్**




"సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనేదే మా సిద్ధాంతం. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దడమే లక్ష్యం" అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. సమాజంలో మార్పు కోసం విద్యావంతులైన యువత రాజకీయాల్లోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. విశాఖ జిల్లా మధురవాడలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను 'ప్రాజెక్ట్ చంద్రా'లో భాగంగా దివీస్ ల్యాబ్స్ సహకారంతో ఆధునీకరించారు. శనివారం ఈ పాఠశాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ప్రత్యేకంగా ముఖాముఖి

తరువాయి 2లో..

# నేను శంకుస్థాపన చేశా.. నేనే ప్రారంభిస్తున్నా వెలిగొండపై సీఎం చంద్రబాబు

మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభానికి సిద్ధం


ఆగస్టు 31న ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు సీఎం వెల్లడి

కూటమి ప్రభుత్వం 48 రోజుల్లో నిర్వాసితులకు రూ.768 కోట్ల పరిహారం చెల్లింపు

గత ప్రభుత్వ నిర్వాకం వల్లే ప్రాజెక్టు ఆలస్యమైందని సీఎం చంద్రబాబు విమర్శ

ప్రభుత్వం అందించిన పరిహారంపై నిర్వాసితుల హర్షం

**అమరావతి, సిటిజన్ టైమ్స్**



మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ఆగస్టు 31వ తేదీన ప్రారంభించి నీటిని విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మూడో విడత పరిహారంగా రూ.250 కోట్ల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామని స్పష్టం చేశారు.

**48 రోజుల్లోనే రూ.768 కోట్ల పరిహారం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 48 రోజుల్లోనే వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు రికార్డు స్థాయిలో పరిహారం అందించింది. మూడు విడతల్లో మొత్తం 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. తొలి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో

తరువాయి 2లో..

# విశాఖ వేదికగా బ్రిక్స్ దేశాల సదస్సు..

### తోట్లకొండను సందర్శించిన బ్రిక్స్ ప్రతినిధులు

భారత్ అధ్యక్షతన విశాఖలో బ్రిక్స్ యువజన, క్రీడా మంత్రుల సమావేశాలు

మొత్తం 11 సభ్య దేశాల ప్రతినిధుల హాజరు

సమావేశాలకు ముందు తోట్లకొండ బౌద్ధ క్షేత్ర సందర్శన

యువజన సాధికారత, క్రీడల్లో సహకారంపై ప్రధానంగా చర్చ

ఏపీ సీఎం చంద్రబాబుతోనూ భేటీ కానున్న ప్రతినిధులు




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్**

భారత్ అధ్యక్షతన జరుగుతున్న 2026 బ్రిక్స్ సదస్సులో భాగంగా సాగర నగరం విశాఖపట్నం కీలక సమావేశాలకు ఆతిథ్యం ఇస్తోంది. ఇవాళ, రేపు తేదీల్లో బ్రిక్స్ యువజన వ్యవహారాల మంత్రుల సమావేశం, క్రీడా మంత్రుల

తరువాయి 2లో..

# రాకెట్ల తయారీకి ఇస్రో గుడ్‌బై.. ప్రైవేట్ రంగానికి కీలక బాధ్యతలు!

### లాంచ్ వెహికల్స్ తయారీ నుంచి క్రమంగా తప్పుకోనున్న ఇస్రో



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇకపై లాంచ్ వెహికల్స్ తయారీ, సాధారణ శాటిలైట్ల తయారీ వంటి కార్యకలాపాల నుంచి ఇస్రో క్రమంగా తప్పుకోనుంది. ఈ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించనుంది. ఇస్రో పరిశోధన, అత్యాధునిక సాంకేతికత అభివృద్ధి, శాస్త్రీయ ప్రయోగాలు, ప్రత్యేక మిషన్లపై మరింత దృష్టి పెట్టనుంది. బిజినెస్ టుడే నిర్వహించిన ఇండియా ఏ 100 ఎకానమీ సమ్మిట్‌లో ఇన్‌స్పేస్ చైర్మన్ డాక్టర్ పవన్ గోయెంకా ఈ విషయాన్ని వెల్లడించారు. "ఇస్రో

తరువాయి 2లో..

## యుద్ధానికి ముగింపు పలుకుదాం.. ట్రంప్‌కు ఇరాన్ అధ్యక్షుడి సందేశం

శక్తిమంతంగా, గౌరవంగా ఉన్నప్పుడే ముగించడం మేలని వ్యాఖ్య

అమెరికాను ప్రపంచమంతా ద్వేషిస్తోందన్న పెజెష్కియాన్

కొనసాగుతున్న ప్రతిష్టంభన.. మధ్యవర్తిత్వం చేస్తున్న ఒమన్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

అమెరికాతో నెలల తరబడి కొనసాగుతున్న

తరువాయి 2లో..

# నైరుతి పవనాల్లో తీవ్ర అసమానతలు.. ఏపీలో 40 శాతం వర్షపాతం లోటు

దేశంలో 13 శాతం లోటు వర్షపాతం -ఒడిశాలో సాధారణం కంటే 25 శాతం అధిక వర్షాలు

వివిధ రాష్ట్రాల మధ్య వర్షపాతంలో తీవ్ర అసమానతలు

వర్షాధార వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్న లోటు

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు బలహీనంగా కొనసాగుతున్నాయి. ఆగస్టు 21 నాటికి దేశంలో వర్షపాతం 13 శాతం లోటుతో నమోదైంది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన గణాంకాల ప్రకారం, జూన్ 4 నుంచి ఇప్పటివరకు దీర్ఘకాలిక సగటు 619 మిల్లీమీటర్లకు గాను కేవలం 537.6 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే కురిసింది. అయితే, ఈ జాతీయ సగటుకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు మధ్య తీవ్ర వ్యత్యాసం కనిపిస్తోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయి. పలు

తరువాయి 2లో..



## ఎడిటోరియల్

### 'ఎన్టీఆర్' ఇమేజ్ పోగొట్టుకున్న వైసీపీ.. !

టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ఎన్టీఆర్ పేరును వినియోగించుకునే విషయంలో వైసీపీ గత పాలనలో ముందున్న విషయం తెలిసిందే. ఏకంగా కృష్ణా జిల్లాను విడదీసి.. ఎన్టీఆర్ పేరు పెట్టారు. దీంతో ఒక జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టిన ఘనత తమ దేనని ప్రకటించుకున్నారు. తర్వాత.. ఆయన పేరుతో పాలిటిక్స్ చేయాలని అనుకున్నారు. ఎన్టీఆర్ సామాజిక వర్గాన్ని ఆకర్షించే ప్రయత్నం చేశారు. కానీ, ఇదేసమయంలో హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరు తీసేయడం.. వచ్చిన ఇమేజ్‌ను పోగొట్టిందన్న వాదన ఉంది. కట్ చేస్తే.. ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ పాలిటిక్స్ ఒక అడుగు ముందుకు పది అడుగులు వెనక్కి అన్నచందం గా ఉన్నాయని పరిశీలకులు చెబుతున్నారు. ప్రతి జిల్లాలోనూ వైసీపీ నాయకులు ఉన్నారు. వారిలో ఒకరి ద్దరు జిల్లాలో బలమైన నాయకులుగా ఎదిగారు. ఉదాహరణకు కృష్ణా జిల్లాలో పేర్ని నాని, కొడాలి నాని ఫైర్ బ్రాండ్స్‌గా ఉన్నారు. ఇలా చూసుకుంటే.. ఎన్టీఆర్ జిల్లాలో జోగి రమేష్ కొంత మేరకు ఫైర్ బ్రాండ్‌గా గుర్తింపు కోసం ప్రయత్నించినా.. ఆయన కేసుల్లో చిక్కుకుని బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఇక, మిగిలిన నాయకుల్లో సామినేని ఉదయబాను జనసేనలోకి వెళ్లిపోయారు. నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు ఈ గ్యాప్ ఫిల్ చేయాలని అనుకున్నప్పటికీ.. సాధ్యం కాలేదు. ఇక, విజయవాడలోనూ బలమైన నాయకులు లేకుండా పోయారు. గతంలో మల్లాది విష్ణు ఉన్నా.. ఆయన పరిస్థితి ఇరకాటంలో పడింది. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు అంతర్గత కుమ్ములాటలతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వైసీపీకి బలమైన నాయకులు కరువయ్యారు. ఇక, కీలకమైన ఎంపీ పోస్టు ఖాళీగానే ఉంది. ఎంపీ అభ్యర్థిని ఇప్పటి వరకు ఎంపిక చేయకపోవడంతో వైసీపీ తరఫున వాయిస్ వినిపించే బలమైన వారు కనిపించడం లేదన్నది వాస్తవం. మరోవైపు కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీలో అంతర్గత పోరు జరుగుతోందని.. అది తమకు లాభిస్తుందని వైసీపీ వేసుకున్న అంచనాలు కూడా తలకిందులు అయ్యాయి. పార్టీ పరంగా తీసుకున్న చర్యలతో తమ్ముళ్లు సర్దుకుపోతున్నారు. దీంతో ఎన్టీఆర్ పేరు పెట్టుకున్నా.. జిల్లాలో వైసీపీ పెద్దగా పుంజుకోలేక పోవడం.. ఏడు నియోజకవర్గాల్లోనూ కూటమి బలంగా ఉండడం గమనార్హం.

### నైరుతి పవనాల్లో తీవ్ర అసమానతలు.. ఏపీలో 40 శాతం వర్షపాతం లోటు

రాష్ట్రాలు భారీ వర్షపాతం లోటుతో సతమతమవుతున్నాయి. హరియాణాలో 45 శాతం, బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 40 శాతం చొప్పున వర్షపాతం తక్కువగా నమోదైంది. పంజాబ్‌లో 32 శాతం, కర్ణాటకలో 25 శాతం లోటు కొనసాగుతోంది. దీనికి పూర్తి విరుద్ధంగా, ఒడిశాలో 25 శాతం అధిక వర్షపాతం నమోదు కాగా, జమ్మూకశ్మీర్‌లో 6 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. వాతావరణ వ్యవస్థలు పదేపదే మధ్య, తూర్పు భారతదేశంలో కేంద్రీకృతం కావడంతో ఉత్తర, వాయవ్య, దక్షిణ ప్రాంతాలు పొడిగా మిగిలిపోతున్నాయి. జూన్‌లో బలహీనంగా ప్రారంభమైన రుతుపవనాలు, జులైలో కాస్త మెరుగుపడినా, ఆగస్టులో లోటు మళ్లీ 11 నుంచి 13 శాతం వద్ద స్థిరపడింది. ప్రభుత్వం గుర్తించిన 262 వర్షాభావ ప్రభావిత జిల్లాల్లో దాదాపు సగం జిల్లాల్లో ఇప్పటికీ లోటు వర్షపాతమే నమోదవుతోంది. ఇది వర్షాధార వ్యవసాయంపై తీవ్ర ఆందోళనలకు కారణమవుతోంది. రానున్న రోజుల్లో మధ్య, తూర్పు, ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో మరోసారి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ, ఇలా అడపాదడపా కురిసే భారీ వర్షాలు.. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వర్షాభావాన్ని పూర్తిగా భర్తీ చేయలేవని స్పష్టం చేస్తున్నారు. రుతుపవనాల చివరి దశలోనూ ఈ ప్రాంతీయ అసమానతలు కొనసాగే అవకాశం ఉందని అంచనా.

# విద్యార్థుల ప్రశ్నలు నారా లోకేశ్ జవాబులు..

నిర్వహించి, వారి ప్రశ్నలకు స్ఫూర్తిదాయకంగా, ఆసక్తికరంగా సమాధానాలిచ్చారు. పాఠశాలకు చేరుకున్న మంత్రి లోకేశ్ కు వేదపండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆధునికీకరించిన తరగతి గదులు, క్రీడా మైదానాలు, ఇతర మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సరదాగా కాసేపు వాలీబాల్ ఆడారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

**మంత్రితో విద్యార్థుల ముఖాముఖి**

సాధారణ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు భిన్నంగా మంత్రి లోకేశ్ విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన ఓపికగా సమాధానాలిచ్చారు.

విద్యార్థి ప్రశ్న: మీరు గతంలో చూసిన చంద్రంపాలెం పాఠశాలకు, ఇప్పటి పాఠశాలకు తేడా ఏంటి?

లోకేశ్: నేను గతంలో రెండుసార్లు ఈ స్కూల్‌కు వచ్చినా, రెండుసార్లూ వర్షం పడింది. అప్పుడు పరిసరాలు బురదమయంగా ఉండేవి. ఇప్పుడు దివీస్ ల్యాబ్స్ సహకారంతో పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల ఇలాగే అభివృద్ధి చెందాలన్నదే మా లక్ష్యం.

**విద్యార్థి ప్రశ్న: మీకు ఇష్టమైన ఆట ఏంటి?**

లోకేశ్: ప్రతి భారతీయుడిలాగే నాకు క్రికెట్ అంటే ఇష్టం. ప్రతీ ఆదివారం నా కుమారుడు దేవాన్ష్‌తో రెండు గంటలైనా క్రికెట్ ఆడతాను. అంతకుమించి సమయం ఇవ్వడానికి ముఖ్యమంత్రి గారు అవకాశం ఇవ్వడం లేదు (అని నవ్వుతూ అన్నారు).

**విద్యార్థిని ప్రశ్న: క్రీడల్లో మహిళలకు అవకాశాలు తక్కువగా ఉన్నాయి కదా?**

లోకేశ్: ఇది నిజమే. మహిళలు క్రీడల్లోకి రావడానికి తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడం, సరైన వసతులు లేకపోవడం వంటి అడ్డంకులు ఉన్నాయి. అందుకే మహిళలను ప్రోత్సహించడానికి 'షీ ప్లే' అనే ప్రత్యేక విధానాన్ని తీసుకొస్తున్నాం. ప్రతిభకు అవకాశం ఇస్తే మహిళలు అద్భుతాలు సృష్టిస్తారు. మన తెలుగు క్రీడాకారిణి శ్రీచరణి మొదట క్రికెట్ ఆడతానంటే తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. కానీ అవకాశం వచ్చాక ప్రపంచంలోనే ఉత్తమ బౌలర్‌గా ఎదిగింది.

**విద్యార్థి ప్రశ్న: చిన్నప్పుడు తక్కువ మార్కులు వస్తే మీ తల్లిదండ్రులు ఎలా స్పందించేవారు?**

లోకేశ్: నా చదువు విషయంలో మా అమ్మ చాలా క్రమశిక్షణతో ఉండేవారు. ఒకసారి రిపోర్ట్ కార్డులో నేనే సంతకం పెట్టి దొరికిపోయాను. తప్పుడు మార్గాల్లో వెళ్లకుండా నన్ను క్రమశిక్షణతో పెంచింది మా అమ్మే. నేను ఈ స్థాయికి రావడానికి ఆమే కారణం. నాన్నకు నా మార్కుల గురించి పట్టించుకునేంత సమయం ఉండేది కాదు.

**విద్యార్థి ప్రశ్న: రాజకీయాల్లోకి రాకపోతే ఏం చేసేవారు?**

లోకేశ్: 2005లో చంద్రబాబు గారు ఓడిపోయినప్పుడు ఆయనతో కలిసి ఒక పెళ్లికి వెళ్లాను. అక్కడ ఆయన రాగానే సుమారు 5 వేల మంది గౌరవంగా లేచి నిలబడ్డారు. ప్రజలు ఇచ్చే ఆ గౌరవాన్ని చూసి, అప్పుడే రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నాను.

**విద్యార్థి ప్రశ్న: పదో తరగతి ఫలితాలపై విద్యార్థుల ఫొటోలతో ప్రకటనలు ఎందుకు ఇచ్చారు?**

లోకేశ్: ప్రభుత్వ బడుల్లో చదివి ప్రతిభ చూపిన విద్యార్థుల ఫొటోలను పత్రికల్లో చూస్తారని అసెంబ్లీలో మాటిచ్చాను. ఆ మాట నిలబెట్టుకున్నాను. వారి కష్టాన్ని, ప్రతిభను ప్రపంచానికి తెలియజేయాలనే ఉద్దేశంతోనే రాజకీయ నాయకుల ఫొటోలు లేకుండా ప్రకటనలు ఇచ్చాం.

**విద్యార్థి ప్రశ్న: మీరు దేవుడిని నమ్ముతారా? మీకు ఇష్టమైన దేవుడు ఎవరు?**

లోకేశ్: సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనేది మా సిద్ధాంతం. పేదరికం లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ సాయం చేయాలి. సాయం చేసే గుణం ఉన్నప్పుడే మీలో దేవుడు కనిపిస్తాడు.

**విద్యార్థి ప్రశ్న: విద్యార్థి దశలో మీకు అత్యంత సంతోషాన్ని ఇచ్చిన విషయం?**

లోకేశ్: భారీ వర్షాలు పడి పాఠశాలకు సెలవు ప్రకటిస్తే నాకు చాలా సంతోషంగా ఉండేది. కానీ ఇప్పుడు మీకు ఆ అవకాశం లేదు (అంటూ విద్యార్థులను నవ్వించారు).

**విద్యార్థి ప్రశ్న: మీ బెస్ట్ ఫ్రెండ్ ఎవరు?**

లోకేశ్: అది సీక్రెట్ (అని సరదాగా అన్నారు). పాఠశాల, కళాశాల స్నేహాలను ఎప్పటికీ మర్చిపోవద్దు. తల్లిదండ్రుల తర్వాత మన భావాలను పంచుకునేది స్నేహితులతోనే.

అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. చదువుకున్న యువత సమాజంలో మార్పు తీసుకురావడానికి రాజకీయాల్లోకి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దివీస్ ల్యాబ్ డైరెక్టర్ నీలిమ, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా విద్యార్థుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. పట్టుదలతో కష్టపడితే ఏదైనా సాధించవచ్చని నీలిమ విద్యార్థులకు సూచించారు.

**విద్యార్థి ప్రశ్న: గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన మీరు, ప్రస్తుత మంత్రి లోకేశ్ గారికి ఏం సలహా ఇస్తారు?**

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు: (నవ్వుతూ) మా ఇద్దరికీ గొడవ పెట్టాలని చూస్తున్నావా? లోకేశ్ గారు ఒక విజనరీ లీడర్. ఆయన పాదయాత్ర చేయొద్దన్నా చేశారు, మంగళగిరిలో పోటీ చేయొద్దన్నా చేసి గెలిచారు. మేము ఐదేళ్లలో నేర్చుకున్నది ఆయన ఏడాదిలోనే నేర్చుకున్నారు. ఆయనకు ప్రత్యేకంగా సలహా అవసరం లేదు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. గంటా శ్రీనివాసరావు, నారాయణ వంటి అనుభవజ్ఞుల సూచనతోనే 10 వేల పాఠశాలల్లో 'వన్ క్లాస్-వన్ టీచర్' విధానాన్ని అమలు చేశామని తెలిపారు. పాఠశాల ఆధునికీకరణకు ముందుకు వచ్చిన దివీస్ ల్యాబ్స్ డైరెక్టర్ నీలిమకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేను శంకుస్థాపన చేశా.. నేనే ప్రారంభిస్తున్నా వెలిగొండపై సీఎం చంద్రబాబు

1,622 కుటుంబాలకు రూ.200 కోట్లు అందించగా, శుక్రవారం మూడో విడతగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్లు సీఎం చేతుల మీదుగా అందజేశారు. నిర్వాసితులకు ఇంకా రూ.132 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు తొలిదశ పూర్తయితే 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, సుమారు 4 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుంది.

**గత ప్రభుత్వ డ్రామాలతోనే ఆలస్యం: సీఎం**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "1996లో నేనే ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి శంకుస్థాపన చేశాను. ఇప్పుడు 2026లో నా చేతుల మీదుగానే ప్రారంభించడం నా అదృష్టం. గత రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేసి మొదటి దశ పనులు పూర్తి చేశాం" అని తెలిపారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉన్నా, శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు నీరు రాకపోయినా, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని స్పష్టం చేశారు. "వాస్తవానికి ఈ ప్రాజెక్టు 2021లోనే పూర్తి కావాల్సింది. కానీ గత పాలకుల డ్రామాల వల్ల ఆలస్యమైంది. వారు రాష్ట్రాన్ని ఆర్థికంగా చిదిమేశారు. అయినా 'సూపర్ సిక్స్' వంటి పథకాలను అమలు చేస్తూనే, ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం" అని విమర్శించారు. గంగా-గోదావరి-కావేరి నదుల అనుసంధానం ద్వారా దేశంలో నీటి భద్రత సాధించవచ్చని సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించినట్లు గుర్తుచేశారు. మార్కాపురం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి నీరు అందిస్తామని, సెప్టెంబరులో హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. రామాయపట్నం పోర్టు ద్వారా రైతులు తమ ఉద్యాన ఉత్పత్తులను ఎగుమతి చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు.

**పరిహారంపై నిర్వాసితుల హర్షం**

ప్రభుత్వం అందించిన పరిహారంపై నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తమను ఇబ్బందులు పెట్టిందని, కూటమి ప్రభుత్వం ఆదుకుందని రైతు కాశిరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఆయనే ప్రారంభించడం సంతోషంగా ఉందని మరో నిర్వాసితుడు బోగెం శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వం తమకు పూర్తి పరిహారం అందించి, కాలనీల్లో మంచి వసతులు కల్పించిందని మహిళా నిర్వాసితురాలు ఉషమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

# విశాఖ వేదికగా బ్రిక్స్ దేశాల సదస్సు.. తోట్లకొండను సందర్శించిన బ్రిక్స్ ప్రతినిధులు

సమావేశం ఇక్కడ జరుగుతున్నాయి. బ్రెజిల్, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, భారత్, ఇండోనేషియా, ఇరాన్, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, యూఏఈ సహా 11 సభ్య దేశాల మంత్రులు, ఉన్నత స్థాయి ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా ఈ రెండు సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నారు. సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు, ఇవాళ ఉదయం బ్రిక్స్ దేశాల ప్రతినిధులు నగరంలోని ప్రఖ్యాత బౌద్ధ వారసత్వ ప్రదేశమైన తోట్లకొండను సందర్శించారు. బంగాళాఖాతానికి అభిముఖంగా ఉన్న ఈ ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న గొప్ప సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని వారికి పరిచయం చేసింది. ఈ సందర్భంగా ప్రతినిధులు అక్కడ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. 'స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే నినాదంతో ఈ ఏడాది భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఇవాళ జరిగిన యువజన మంత్రుల సమావేశంలో యువత అభివృద్ధి, సాధికారతపై ప్రధానంగా దృష్టి సారించారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత, శ్రేయస్సు, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలపై చర్చించారు. ఈ భేటీలో బ్రిక్స్ యూత్ మినిస్టీరియల్ జాయింట్ డిక్లరేషన్‌తో పాటు, బ్రిక్స్ యూత్ కోఆపరేషన్ ఫ్రేమ్‌వర్క్‌ను ఆమోదించనున్నారు. రేపు జరగనున్న క్రీడా మంత్రుల సమావేశంలో క్రీడల్లో పరస్పర సహకారాన్ని పునరుద్ఘాటించనున్నారు. ముఖ్యంగా సంప్రదాయ, దేశీయ క్రీడలు, క్రీడా సాంకేతికత, క్రీడా పరికరాల తయారీ, ఆవిష్కరణలు వంటి అంశాలపై చర్చించనున్నారు. ఈ సమావేశం చివరిలో బ్రిక్స్ క్రీడా ఉమ్మడి ప్రకటనను ఆమోదించే అవకాశం ఉంది. ఈ రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశం కానున్నారు. అలాగే, ద్వైపాక్షిక చర్చలు, బీచ్ రోడ్‌లో బ్రిక్స్ ఫ్రెండ్‌షిప్ సైక్లింగ్ ఈవెంట్, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. కేంద్ర సహాయ మంత్రి రక్షా ఖడ్సే, కార్యదర్శులు సునీల్ పలివాల్, హరి రంజన్ రావు ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

# రాకెట్ల తయారీకి ఇస్రో గుడ్‌బై..

ఇకపై ఎలాంటి లాంచ్ వెహికల్స్‌ను తయారు చేయదు. వాటి తయారీని ప్రైవేట్ రంగం లేదా ప్రభుత్వ రంగ సంస్థలు చేపడతాయి" అని ఆయన తెలిపారు. ఈ మార్పు ఇప్పటికే ప్రారంభమైంది. చిన్న ఉపగ్రహాలను ప్రయోగించే స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వీ) సాంకేతికత, ఉత్పత్తి హక్కులను బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు బదిలీ చేశారు. తదుపరి దశలో భారత్ ప్రధాన రాకెట్లైన పీఎస్ఎల్వీ (పీఎస్ఎల్వీ), ఎల్వీఎం-3 (ఎల్వీఎం3) సాంకేతికత, తయారీ కూడా ప్రైవేట్ రంగానికి బదిలీ చేసే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే ఈసారి ప్రభుత్వ రంగ సంస్థలకు బదులుగా ప్రైవేట్ పరిశ్రమలకే అవకాశం కల్పించనున్నట్లు గోయెంకా తెలిపారు. ఇకపై ఇస్రో ఒక తయారీ సంస్థగా కాకుండా ప్రధానంగా పరిశోధన, అభివృద్ధి సంస్థగా పనిచేయనుంది. కొత్త సాంకేతికతలు, శాస్త్రీయ మిషన్లు, ప్రత్యేక ఉపగ్రహాలు, అధునాతన అంతరిక్ష మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించనుంది. ఒక సాంకేతికత అభివృద్ధి చెంది వాణిజ్యపరంగా వినియోగించేందుకు సిద్ధమైన తర్వాత దానిని ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తామని గోయెంకా చెప్పారు. ఇప్పటివరకు ఇస్రోకు చెందిన 120 సాంకేతికతలను ప్రైవేట్ రంగానికి బదిలీ చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం నిర్మిస్తున్న కొత్త లాంచ్ సెంటర్ నిర్వహణ బాధ్యతలను కూడా ప్రైవేట్ రంగానికి అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన ఆపరేటర్‌ను వచ్చే నాలుగు లేదా ఐదు నెలల్లో ఖరారు చేసే అవకాశం ఉందని గోయెంకా తెలిపారు. భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను ప్రస్తుతం ఉన్న సుమారు 8 బిలియన్ డాలర్ల నుంచి 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే ప్రభుత్వ డిమాండ్, అంతరిక్ష సాంకేతికతను ఇతర రంగాల్లో విస్తృతంగా వినియోగించడం, అంతర్జాతీయ మార్కెట్లలో భారత సంస్థల విస్తరణ కీలకమని గోయెంకా చెప్పారు.

## మొదటి పేజీ తరువాయి

### అరోగ్యం బాలేకపోతే.. చాట్‌జీపీటీలో వెతికేస్తున్నారు.. - రాజ్‌నాథ్‌సింగ్

నోయిడాలో ఆయన మాట్లాడుతూ.. "ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడం మంచి పరిణామమే. కానీ ఇంటర్నెట్‌లో కనిపించిన సమాచారంతోనే రోగ నిర్ధారణకు రావడం సరైంది కాదు. స్వల్పంగా ఛాతీనొప్పి వచ్చినా.. ఆన్‌లైన్‌లో వెతికి తీవ్రమైన గుండె జబ్బు ఉందని కొందరు భయపడుతున్నారు. అదే నొప్పి.. ఆందోళన, కండరాల సమస్యల వల్ల కూడా రావచ్చు. కొందరు రోగులు వారికి ఉన్న లక్షణాలు చెప్పకుండా.. ఇంటర్నెట్‌లో చదివిన వ్యాధి పేరును వైద్యుడికి చెబుతున్నారు" అని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోగులు.. స్థానిక భాషలోని పదాలతో లక్షణాలను చెప్పడం కూడా వైద్యులకు సవాలేనని రాజ్‌నాథ్ అన్నారు. ఛాతీలో 'దుక్ దుక్'గా ఉందని ఓ గ్రామీణుడు వైద్యుడికి చెప్పిన ఉదాహరణను ఆయన వివరించారు. వైద్య విద్యలో 'దుక్ దుక్' అనే లక్షణం గురించి ఎక్కడా ఉండదని చమత్కరించారు. యంత్రాలు శరీరంలో ఏం జరుగుతుందో గుర్తించగలవు.. కానీ రోగి మనసులోని భయం, ఆందోళనను అర్థం చేసుకోవడం వైద్యులకే సాధ్యమని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు.

### 75 దేశాలకు వీసాల నిలిపివేత కేసు.. ట్రంప్‌నకు కోర్టు షాక్

నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జీనెట్ వెల్లడించారు. వలస వీసాల విషయంలో కాన్సులర్ అధికారుల జోక్యంపై విదేశాంగ కార్యదర్శికి ఉన్న అధికారాన్ని ఆ చట్టం తొలగించిందన్నారు. వారి వీసాలను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. "75 దేశాల వ్యక్తులు అమెరికా ప్రజల నుంచి ఆమోదయోగ్యం కానంత అధికంగా సంక్షేమ ఫలాలు పొందుతున్నారు! అందుకే వారికి ఇమ్మిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని నిర్ణయించాం. కొత్త వలసదారులు అమెరికన్ల సంపదను సంగ్రహించకుండా రక్షణ కల్పించేంతవరకూ, వారు మాకు భారంగా మారరని నిర్ధారణ అయ్యేంతవరకూ ఈ నిలిపివేత అమల్లో ఉంటుంది. ట్రంప్ సర్కారు ఎప్పుడూ అమెరికా ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తుంది" అని ఆ దేశ విదేశాంగ శాఖ అప్పట్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

### దౌత్యనీతి అంటే టీ20లే కాదు.. టెస్టులూ ఉంటాయి: జైశంకర్

ప్రసంగించారు. ప్రస్తుత దౌత్యనీతి 'టీ20 క్రికెట్'ను పోలి ఉందా? అనే ప్రశ్నకు ఆయన ఈమేరకు స్పందించారు. "అంతర్జాతీయ సంబంధాలు సుదీర్ఘమైన, అనిశ్చిత ప్రక్రియలతో కూడుకున్నవి. భౌగోళిక రాజకీయ సమస్యలకు ప్రభుత్వాలు, మీడియా త్వరితగతిన పరిష్కారాలు కోరుకుంటాయి. కానీ వీటి పరిష్కారం సుదీర్ఘకాలంలో రూపుదిద్దుకుంటుంది. అదే సమయంలో టీ20 మాదిరి.. మీడియాకు స్వల్పకాలిక పరిణామాలను అందించాల్సిన అవసరం ఉంది. అయితే, వాస్తవ ప్రపంచంలో టెస్ట్ మ్యాచ్‌లూ ఉంటాయి. వాటి ఫలితాలు తక్కువ సమయంలో తేలిపోయేవి కావు. పశ్చిమాసియా యుద్ధం ఒక టీ20 మ్యాచ్‌లా ఉంటుందని అంతా భావించారు. కానీ అది ఏకంగా టెస్ట్ సిరీస్, అంతకంటే ఎక్కువ కాలం సాగే ప్రక్రియగా మారింది" అని పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్టుల వద్ద 'బోర్డింగ్ పాస్'.. కేంద్రం కీలక నిర్ణయం

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా గొలుసు సమస్యలు, మార్కెట్ అంతరాయాలతో కూడిన నేటి అనిశ్చిత ప్రపంచంలో వ్యాపార సంస్థలు, ప్రభుత్వాల కోసం జైశంకర్ నాలుగు సూత్రాలను సూచించారు. అంతరాయాల నుంచి తమను తాము కాపాడుకోవడం వ్యాపార సంస్థలు, ప్రభుత్వాల ప్రాధాన్య అంశంగా ఉండాలని చెప్పారు. 'డి-రిస్కింగ్' తన అతి పెద్ద మంత్రమని పేర్కొన్నారు. ఎక్కువ మంది భాగస్వాములు, అధిక సంఖ్యలో సరఫరా వనరులపై ఆధారపడాలని సూచించారు. ఎన్ని ఎక్కువ ఆప్షన్లు ఉంటే అంత సురక్షితంగా ఉంటారని తెలిపారు. ప్రపంచ మార్కెట్లు తరచూ భౌగోళిక రాజకీయాల వల్ల ప్రభావితమవుతాయనే విషయాన్ని అంగీకరించాలన్నారు. ఇంధనం, ఎరువులు, రవాణా వంటివి దీనికి ఉదాహరణలని తెలిపారు. అంతరాయాలు ఎప్పుడైనా కలగవచ్చని అంచనా వేసి.. ముందుగానే ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. వైవిధ్యం పాటించి, పెట్టుబడులకు భద్రత కల్పించుకోవాలని చెప్పారు.

### యుద్ధానికి ముగింపు పలుకుదాం.. ట్రంప్‌కు ఇరాన్ అధ్యక్షుడి సందేశం

యుద్ధానికి ముగింపు పలకాలని ఇరాన్ పిలుపునిచ్చింది. తాము శక్తిమంతమైన, గౌరవప్రదమైన స్థితిలో ఉన్నప్పుడే యుద్ధాన్ని ముగించడం మేలని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం వైద్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. "మనం శక్తిమంతంగా, గౌరవంగా ఉన్న ఈ సమయంలోనే యుద్ధానికి ముగింపు పలకడం ఉత్తమం" అని పెజెష్కియాన్ అన్నారు. ఈ పోరాటంలో ఇరాన్ విజయం సాధించిందని ప్రపంచం గుర్తించిందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించి అమెరికా పాఠశాలలు, ఆసుపత్రులపై దాడులు చేస్తోందని, అందుకే ప్రపంచవ్యాప్తంగా అమెరికా పట్ల ద్వేషం పెరిగిపోయిందని ఆరోపించారు. ఈ ఏడాది ఆరంభంలో అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులతో ప్రారంభమైన ఈ సంఘర్షణ, ప్రస్తుతం ప్రతిష్టంభనలో కొనసాగుతోంది. హర్మూజ్ జలసంధిలో ఇబ్బందులు, అమెరికా నౌకాదళ దిగ్బంధనం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. మరోవైపు, వాషింగ్టన్ ఆర్థిక ఒత్తిడిని తీవ్రతరం చేస్తూ కొత్త ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది. చర్చలకు మార్గం సుగమం చేసేందుకు ఒమన్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కొనసాగిస్తోంది. జూన్‌లో అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందంలో ఇరాన్ లొంగిపోయినట్లు ఎలాంటి నిబంధనలు లేవని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులకు తలొగ్గేది లేదని, అవసరమైతే గట్టిగా బదులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. దేశంలో ఆర్థిక ఒత్తిళ్లు, అంతర్జాతీయంగా ఒంటరితనం పెరుగుతున్న నేపథ్యంలో, శక్తిమంతమైన స్థితి నుంచే తాము శాంతి చర్చలకు సిద్ధమనే సంకేతాలు పంపేందుకే టెహ్రాన్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

## విశాఖ విమానాశ్రయంలో నారా లోకేశ్‌ను కలిసిన కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్



**ఆనందపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**

విశాఖ విమానాశ్రయంలో వేములవలస మాజీ ఉపసర్పంచ్, తెలుగుదేశం పార్టీ నాయకుడు కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయనతో మాట్లాడినట్లు తెలిపారు. విశాఖ విమానాశ్రయంలో అనుకోకుండా నారా లోకేశ్ ఎదురుపడటంతో నవీన్ జ్ఞానేశ్వర్ ఆయనను కలిసి పలకరించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న పరిస్థితులు, ప్రజలకు సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి ప్రజల ఆకాంక్షలను నాయకుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారని నవీన్ జ్ఞానేశ్వర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీ అధిష్ఠానం సూచనలకు అనుగుణంగా స్థానికంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నారా లోకేశ్‌తో కలిసిన విషయాన్ని నవీన్ జ్ఞానేశ్వర్ పార్టీ శ్రేణులతో పంచుకున్నారు. ఈ భేటీ సందర్భంగా తీసుకున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

## కార్యాలయాలు పరిసరాలు పరిశుభ్రత బాధ్యతాయుతంగా నిర్వహించాలి

**- జిల్లా రెవెన్యూ అధికారి వి. సుబ్బారావు**



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**

"స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర" లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు పరిసరాలు పరిశుభ్రత బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.సుబ్బారావు తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని జిల్లా రెవెన్యూ అధికారి ప్రాంగణం నందు రెవెన్యూ అధికారులు, అన్ని విభాగాల సిబ్బందితో కలిసి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం లక్ష్యాలను విజయవంతం చేయాలని, అదేవిధంగా కలెక్టరేట్ ప్రాంగణంలో చెత్త వెయ్యకుండా వ్యర్థాలను నిర్దేశిత ప్రదేశాలలో మాత్రమే వేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి నీటి వనరుల కలుషితం చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలని ఆయన కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు మరియు కలెక్టరేట్ ప్రాంగణంలో అన్ని విభాగాలు వద్ద ఏర్పాటుచేసిన డస్ట్ బిన్లలో మాత్రమే చెత్తను వేసి కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిపాలన అధికారి కే.నాగలక్ష్మమ్మ,రెవిన్యూ సిబ్బంది అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల స్వచ్ఛాంధ్రాలో గంటా




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**

జీవీఎంసీ 6వ వార్డు రిక్షా కాలనీలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రభుత్వం ఎంపిక చేసిన "ఆరోగ్య పాఠశాలలు - ఆరోగ్య ఆంధ్రా" అంశంలో భాగంగా పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో స్వచ్ఛాంధ్రా ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చేలా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు శిక్షణనివ్వాలని గంటా పేర్కొన్నారు. 627 మంది విద్యార్థులున్న పాఠశాలలో ఫలితాలు, సౌకర్యాల గురించి ఆరా తీశారు. హాస్టల్ లో నీటి సమస్య గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే బోరు ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్ ను ఆదేశించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, ఏ.ఎం.హెచ్.ఓ. రాజా రవికుమార్, ప్రిన్సిపాల్ రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ శాంతకుమారి, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, లొడగల జానకిరాం, పోలిశెట్టి నాగేశ్వరరావు, మన్యాల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# దేశీయ విత్తనాల రాఖీలను వినియోగించండి

**- ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ రాఖీలు వద్దే వద్దు - జీవరాశితో ఉన్నది ఒక్కటే భూగోళం అని మరవవద్దు**

**- సమస్త జీవరాశినీ పరిరక్షించడం మానవాళి బాధ్యత - జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ**






**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 22**

దేశీయ విత్తనాల రాఖీలను మాత్రమే వినియోగించండి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. శనివారం ఉదయం మద్దిలపాలెం లోని అక్షర ఇంగ్లీష్ మీడియం విద్యా సంస్థలో దేశీయ విత్తనాల రాఖీలు ప్రిన్సిపల్ సునీత అధ్యక్షతన నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. గత ఏడాది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు సైతం విత్తనాల రాఖీలు వినియోగించాలని కోరారని ఆయన వివరించారు. ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ తో రాఖీ లు వద్దే వద్దు అని వివరించారు. ఈ ప్లాస్టిక్ ఆధారంగా తయారు చేసిన రాఖీల వల్ల జీవరాశికి హాని కలుగుతుందని వివరించారు. జీవరాశితో ఉన్నది ఒక్కటే భూగోళం అని మరవవద్దు అని వివరించారు. సమస్త జీవరాశినీ పరిరక్షించడం మానవాళి బాధ్యత అని పేర్కొన్నారు. కంపెనీలు తమ లాభం కోసం కృత్రిమ రంగులతో, ప్లాస్టిక్ రాఖీలు నయనానందకరంగా తయారు చేయడం జరిగుతుందని, కానీ మనం వాటిని వినియోగిస్తే మానవాళికే కాదు సమస్త జీవరాశి కి నష్టం కలుగుతుందని వివరించారు. ప్రస్తుతం మనం ఉన్న పర్యావరణ పరిస్థితులలో ప్లాస్టిక్ రహిత రాఖీలు వినియోగించడం ఆనందదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, యాక్షన్ ఏడు సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో సమన్వయకర్త జె రాజేశ్వరి తదితరులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో పాల్గొని రాఖీలు తయారు చేయడం జరిగింది.

## జీవీఎంసీ ఎన్నికల్లో అధికార కూటమికి ప్రజలే బుద్ధి చెప్పాలి: ప్రియాంక దండి



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 22**

రాబోయే గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమిని ఓడించాలని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రియాంక దండే పిలుపునిచ్చారు. ఈ కూటమి వల్ల విశాఖ నగరానికి జరిగిన మేలేమీ లేదని, పైగా నష్టమే జరిగిందని ఆమె విమర్శించారు. ప్రియాంక దండే మాట్లాడుతూ, గత ఎన్నికల సమయంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుతామని, దాన్ని రక్షిస్తామని ప్రజలకు మాటిచ్చారని, కానీ అధికారంలోకి వచ్చాక ఆ మాట తప్పారని ఆమె ఆరోపించారు. వారి హయాంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ దిశగా అడుగులు పడ్డాయని, ఇది విశాఖ ప్రజల ఆశలపై నీళ్లు చల్లడమేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, రైల్వే జోన్‌కు అత్యంత కీలకమైన కోటిపల్లి-నర్సాపూర్ (కేకే) లైన్‌ను తప్పించి, విశాఖపట్నంకు మొండెం లేని రైల్వే జోన్‌ను తీసుకువచ్చారని, ఇది కూడా విశాఖ ప్రజలను మోసం చేయడమేనని ఆమె దుయ్యబట్టారు. మెట్రో రైల్ విషయంలోనూ ఈ కూటమి ప్రజలను ఊరించిందని, 'మెట్రో రైల్ వచ్చేస్తోంది' అంటూ ప్రచారం చేశారని, కానీ వాస్తవానికి ఇప్పటివరకు ఎక్కడా పనులు ప్రారంభం కాలేదని ప్రియాంక దండే విమర్శించారు. జీవీఎంసీ నిధులతో కార్పొరేటర్లు విహారయాత్రలు చేశారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆమె ఆరోపించారు. విశాఖలో డేటా సెంటర్ల ఏర్పాటును ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా, బలవంతంగా అభివృద్ధి పేరుతో దాన్ని రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. నగరంలోని పలు సమస్యలను ప్రియాంక దండే ప్రస్తావించారు. శానిటేషన్ నిర్వహణ చాలా దారుణంగా ఉందని, నగరం చెత్తాచెదారంతో నిండిపోతోందని ఆమె అన్నారు. రుషికొండలో ప్యాలెస్ గురించి అనేక పోరాటాలు చేసి, అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటివరకు దానిని ప్రజల ఉపయోగంలోకి తీసుకురాలేకపోయారని ఆమె విమర్శించారు. విశాఖలో నీటి సమస్యకు పరిష్కారం చూపలేకపోవడం, చాలా చోట్ల వీధి దీపాలు లేకపోవడం, పార్కుల నిర్వహణ సరిగ్గా లేకపోవడం, మరియు పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడం వంటి అనేక సమస్యలు అలాగే ఉన్నాయని ఆమె వివరించారు. జీవీఎంసీలో అవినీతి కారణంగా సామాన్యుల జేబులకు చిల్లు పడుతోందని, పాలన వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైందని ఆమె ఆరోపించారు. అభివృద్ధి పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, రాబోయే జీవీఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఒక అవకాశం ఇచ్చి చూడాలని ప్రియాంక దండే ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచుతామని, రైల్వే జోన్ సమస్యను పరిష్కరిస్తామని, మరియు మెట్రో రైల్ పనులను వెంటనే ప్రారంభిస్తామని ఆమె హామీ ఇచ్చారు. అలాగే, నగరంలో ఉన్న శానిటేషన్, నీటి సమస్య, వీధి దీపాలు, పార్కులు మరియు పబ్లిక్ టాయిలెట్లు వంటి అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఆమె వాగ్దానం చేశారు. అవినీతి లేని, పారదర్శకమైన పాలనను అందిస్తామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విశాఖను అభివృద్ధి చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

## విఎంఆర్‌డీఏ చైర్మన్ పై చర్యలు తీసుకోవాలి

**మంత్రి లోకేష్‌కు జనసేన నేత మూర్తి యాదవ్ వినతి**



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 22:**

కూటమి ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న విఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అక్రమాలపై విచారణ జరిపి, ఆయనను తక్షణమే పదవి నుంచి తప్పించాలని జనసేన నేత పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. విశాఖ పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఐటీ, విద్యారంగ మంత్రి నారా లోకేష్‌ను పార్టీ కార్యాలయంలో కలిసి ఈ మేరకు సమగ్ర వినతిపత్రం అందజేశారు. ప్రణవ్ గోపాల్ తన పదవిని దుర్వినియోగం చేస్తూ కూటమి నేతల పేర్లతో అధికారులను, విద్యాసంస్థల నిర్వాహకులను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. విజయనగరంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వైసీపీ నేతల లేఅవుట్‌కు స్థానిక ఎమ్మెల్యే వద్దంటున్నా ముడుపులు తీసుకుని అనుమతులు మంజూరు చేశారని పేర్కొన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కనెక్టివిటీ రోడ్లలో భారీగా కమీషన్లు దండుకోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని, ఎయిర్‌పోర్టుతో సంబంధం లేని వైసీపీ మాజీ నేతల ప్రాజెక్టులకు కోట్ల రూపాయలతో రోడ్లు వేశారని వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా కుటుంబ సభ్యులకు నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇవ్వడం, బినామీల ద్వారా టెండర్లు నియంత్రించడం లాంటి అక్రమాలు చేస్తున్నారని తెలిపారు. ఐటీ విభాగంలో గతంలో తక్కువ వ్యయంతో నడిచిన వ్యవస్థను కాదని, బినామీ కంపెనీలను తెచ్చి యాప్‌ల పేరిట నెలకు లక్షల్లో ప్రజాధనం దోచుకుంటున్నారని మూర్తి యాదవ్ పేర్కొన్నారు. అలాగే కాలేజీల రెన్యువల్స్ పేరిట వసూళ్లకు పాల్పడుతూ విద్యాసంస్థలను వేధిస్తున్నారని తెలిపారు. నిబంధనలను కాలరాసి వాణిజ్య సముదాయాలను దీర్ఘకాలిక లీజులకు కట్టబెట్టిన బోర్డు తీర్మానాలపై పునఃసమీక్ష జరపాలని, నిష్పక్షపాత విచారణతో కూటమి ప్రతిష్టను కాపాడాలని మంత్రి నారా లోకేష్‌ను కోరారు.

## జీవో 161జారీపై మినిస్టీరియల్ సిబ్బంది హర్షం

**ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుకు**

**నేతలు, సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన జీవీఎంసీ సిబ్బంది**

**ఇకపై జోనల్ బదిలీలు కాకుండా కమిషనరే సర్వాధ్యక్షులు**

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 22**

జీవీఎంసీలోని మినిస్టీరియల్ సిబ్బంది ఖుషీగా ఉన్నారు. జీవో 135ను సవరిస్తూ ఏపీ ప్రభుత్వం జీవో 161విడుదల చేయడం పట్ల సర్కార్ కు, వివిధ విభాగాల ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద అభినందన సభ ఏర్పాటు చేశారు. జీవీఎంసీ జోనల్, మల్టీ జోనల్ బదిలీలకు సంబంధించి ఉద్యోగుల ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కొత్త జీవో జారీ చేయడం పట్ల వాళ్లంతా సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన సహకారం మరవలేనిదని, రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగుల ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకుని ఏపీ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో కూడా ఈ అంశంపై చర్చించారని గుర్తు చేశారు. ఆయన కృషి వల్లే సవరణతో కూడిన కొత్త జీవో వచ్చిందని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఏపీ జేఏసీ (విశాఖ) చైర్మన్ సత్తి నాగేశ్వర్ రెడ్డి, వీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వీవీ వామనరావు, జీవీఎంసీ ఏఐటీయూసీ అధ్యక్షులు పడాల రమణ, సీఐటీయూ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, కోశాధికారి రవి, జీవీఎంసీ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ. అప్పలనాయుడు, సన్నీ, ఉమెన్ సెక్రెటరీ సుబ్బలక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మజ, లంకా రాంప్రసాద్,



వి. శ్రీనివాసరావు, రాజేష్, జగన్, ప్రసన్న కుమార్ తో పాటు అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరై తమకు సహకరించిన మీడియాకు, విశాఖ ఎమ్మెల్యేలకు మరోమారు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రెసిడెన్షియల్ అంశాన్ని ప్రస్తావించకుండా ఇకపై తమ ఉద్యోగాలకు జీవీఎంసీ కమిషనరే సర్వ సైన్యాధ్యక్షులని నేతలు పేర్కున్నారు. తమకు ఎప్పటికైనా జీవీఎంసీ పరిధిలోనే బదిలీలు, పదోన్నతులు ఉంటాయని స్పష్టం చేశారు.

## శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి నిత్యాన్నదానంనకు 50 వేలు విరాళం...

**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఆగస్టు 22**

డా బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయములో నిర్వహించే నిత్యాన్నదానము నకు సఖినేటిపల్లి వాస్తవ్యులు సోమిశెట్టి సందీప్ కుటుంబ సభ్యులు రూ. 50,000 లు. వేలు విరాళముగా సమర్పించినారు. వీరికి శ్రీ స్వామివారి దర్శనం అనంతరం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాదు ప్రసాద్ శ్రీ స్వామి వారి చిత్రపటం, ప్రసాదములను అందజేయుటమైనది. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఏం సత్యకిరణ్ , సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగిపోకుండా చర్యలు

## 1,15,851 మంది ఓటర్లకు నోటీసులు

## నోటీసులు అందుకున్నవారు ఆందోళన చెందొద్దు






**సిటిజన్ టైమ్స్ నాగర్‌కర్నూల్ ఆగస్టు 22**

నాగర్‌కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ కోరారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కు తొలగిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లాలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై కలెక్టర్ మాట్లాడారు. ఈ ప్రక్రియ ఉద్దేశం అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో కొనసాగించడమేనన్నారు. ప్రజల్లో అపోహలు, అనుమానాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వాస్తవ సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని మీడియా ప్రతినిధులను కోరారు. జిల్లాలో గతంలో 880 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 910 కేంద్రాల పరిధిలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. 2002 నాటి ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ కాని 13,216 మంది ఓటర్లను గుర్తించినట్లు చెప్పారు. ఓటర్లు సమర్పించిన గణన ఫారాల్లోని ఇంటి పేరు, తండ్రి పేరు, తల్లి పేరు, చిరునామా తదితర వివరాలను 2002 నాటి ఓటర్ల జాబితాలోని వివరాలతో సరిపోల్చి పరిశీలించినట్లు తెలిపారు. ఈ పరిశీలనలో మరో 1,02,635 మంది ఓటర్లను గుర్తించినట్లు వివరించారు. రెండు విభాగాల్లో గుర్తించిన ఓటర్లను కలిపి జిల్లాలో మొత్తం 1,15,851 మందికి నోటీసులు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు.

**నోటీసులు అందుకున్నవారు ఆందోళన చెందొద్దు**

గుర్తించిన 1,15,851 మంది ఓటర్లకు గత రెండు రోజులుగా నోటీసులు జారీ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓ) ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లకు నోటీసులు అందిస్తూ అవసరమైన వివరాలను తెలియజేస్తున్నారని చెప్పారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన లేకపోవడం వల్ల కొంతమంది ఓటర్లలో అనవసరమైన ఆందోళనలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు, మీడియా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# రైతులందరికీ సమాన న్యాయం చేయండి...!

**– ప్రతి ఒక్కరికి మూడు సెంట్లు కేటాయించాలి**

**– లోకేష్ బాబుకు వినతి**



**ఆనందపురం,సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**

తర్లువాడ పంచాయతీ పరిధిలో బంజరు భూమి అభివృద్ధి పథకం కింద హామీ ఇచ్చిన 520 మంది రైతులకు ఒక్కొక్కరికి మూడు సెంట్ల చొప్పున భూమి కేటాయించాలని కూటమి నాయకులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు సంయుక్తంగా 520 మంది లబ్ధిదారులకు మూడు సెంట్ల చొప్పున భూమి ఇస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

అయితే ప్రస్తుతం అధికారుల పరిశీలనలో 520 మంది లబ్ధిదారుల్లో 150 మంది మాత్రమే అర్హులుగా గుర్తించారని, వారికే భూమి కేటాయిస్తామని చెబుతున్నారని నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నిర్ణయంతో మిగిలిన రైతులు నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా గతంలో హామీ ఇచ్చిన ప్రతి లబ్ధిదారు రైతుకు మూడు సెంట్ల చొప్పున భూమి కేటాయించి న్యాయం చేయాలని కోరారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. అర్హులైన రైతుల వివరాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఆనందపురం మండల టీడీపీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, తర్లువాడ పంచాయతీ మాజీ సర్పంచ్ బి.ఆర్బి నాయుడు, సీనియర్ నాయకులు బంకు రాజు, ఉప సర్పంచ్ బాలి వెంకట్రాజు, మజ్జి సన్యాసిరావు, జనసేన ప్రధాన కార్యదర్శి మజ్జి శ్రీను, మాజీ సర్పంచ్ బాలి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

**జిల్లా కార్యక్రమ అధికారి డాక్టర్ ఉమావతి**






**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 22**

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా కార్యక్రమ అధికారి డాక్టర్ ఉమావతి స్పష్టం చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం 'స్వర్ణాంధ్ర-- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇళ్లు, కార్యాలయాలు, ఆసుపత్రుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా, చెత్త పేరుకుపోకుండా చూసుకోవడం ద్వారా అంటువ్యాధులను అరికట్టవచ్చని సూచించారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణను వైద్య సిబ్బంది శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ షబీనా భాను, విస్తరణాధికారి శ్యామలరావు, ఫార్మసీ అధికారి జయకుమార్, పర్యవేక్షకులు పార్వతమ్మ, కృష్ణమోహన్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివ్యాంగుల ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు




**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**

మెగాస్టార్ చిరంజీవి 71 వ జన్మదిన సందర్భంగా స్థానిక ఈధరపల్లి దగ్గర ఎస్కే ఓల్డ్ ఏజ్ హోమ్ లో అంబేద్కర్ కోనసీమ జిల్లా దివ్యాంగుల ఐక్య జేఏసీ, జనసేన నాయకులు పెనుమాల నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుకలు నిర్వహించాము .అనంతరం కేక్ కట్ చేసి ఫ్రూట్స్ బిస్కెట్లు రొట్టెలు వృద్ధులకు వికలాంగులకు పంపిణీ చేయడం జరిగినది .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చిరంజీవి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని సినీ రంగంలో అడుగుపెట్టి బ్లడ్ బ్యాంకులో ఏర్పాటు చేసి ఎంతోమంది పేద ప్రజలకు, దివ్యాంగుల పట్ల ఆసక్తితో వారికి సహాయ సహకారాలు అందిస్తూ సినీ రంగంలో చాలామంది దివ్యాంగులకు అవకాశాలు కల్పించి కల్పించడానికి కృషి చేశారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులు ఆయన పుట్టినరోజు పట్ల హర్ష వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల మహా సంఘటన అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్ ఎస్కే ఓల్డ్ ఏజ్ హోమ్ ట్రస్ట్ చైర్మన్ సూర్య కళ కొప్పిశెట్టి వెంకట ప్రసాద్, వృద్ధులు దివ్యాంగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వైఎస్సార్‌సీపీ టికెట్ ఇస్తే 11వ వార్డులో గెలుపే లక్ష్యం

## రెడ్డి జీవన్ కిరణ్మయి

**పార్టీలకతీతంగా ప్రతి గడపలోనూ ఆత్మీయ బంధాలు**

**యువత అండ, ప్రజాదరణతో బరిలోకి దిగేందుకు సిద్ధం**

**గెలిచి అధిష్టానానికి కానుకగా అందిస్తాం**

**స్థానికుల నుంచి సంపూర్ణ మద్దతు**




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 22**

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) 11వ వార్డు నుంచి రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని వైఎస్సార్‌సీపీ నేత రెడ్డి జీవన్ కిరణ్మయి స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానం నమ్మకంతో తనకు అవకాశం ఇచ్చి టికెట్ కేటాయిస్తే, వార్డులో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి ఆ విజయాన్ని అధినాయకత్వానికి కానుకగా అందిస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

**ప్రజలతో అనుబంధం -- నిరంతరం అందుబాటులో సేవలు**

11వ వార్డు పరిధిలోని ప్రతి గడపతోనూ తమ కుటుంబానికి రాజకీయాలకు అతీతంగా మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయని కిరణ్మయి పేర్కొన్నారు. వార్డు ప్రజలు తమను కుటుంబ సభ్యుల్లా ఆదరిస్తున్నారని, ఎవరికి ఏ చిన్న ఆపద వచ్చినా, ఎలాంటి సహాయం కావాలన్నా తాము ఎల్లప్పుడూ ముందుండి అండగా నిలుస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటూ నిరంతరం వారి మధ్యే గడుపుతున్నామని గుర్తుచేశారు.

**యువత మద్దతు -- స్థానికుల ప్రోత్సాహం**

ముఖ్యంగా వార్డు పరిధిలోని యువతలో తన భర్తకు విశేషమైన క్రేజ్, బలమైన పట్టు ఉందని ఆమె వివరించారు. స్థానిక ప్రజలు, యువత తమనే ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని కోరుతూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారని తెలిపారు. ప్రజల కోరిక మేరకు వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు కిరణ్మయి స్పష్టం చేశారు. అధిష్టానం ఆశీస్సులు అందిస్తే వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

# గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం చేయాలి -వాసుపల్లి జానకిరామ్ డిమాండ్




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 22::**

కోనసీమ జిల్లా వాడలరేవు నుంచి వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలను మరింత విస్తృతం చేయాలని ఈస్ట్ కోస్ట్ మెకానైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ డిమాండ్ చేశారు. గత నెలలో విశాఖపట్నం తీరంలో జరిగిన బోటు ప్రమాద విషాదం మరువకముందే, ఆగస్టు 3న వాడలరేవు వద్ద మరో ఏడుగురు మత్స్యకారులు ఫైబర్ బోటుతో సహా అదృశ్యమవ్వడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఘటనలో కేవలం మూడు రోజులకే గాలింపు చర్యలు నిలిపివేయడం సరికాదని, ఫైబర్ బోట్లు సముద్ర ప్రవాహాలు, గాలుల ప్రభావంతో చాలా దూరం కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నందున వాడలరేవు ఘటనలో సుదీర్ఘంగా, విస్తృత పరిధిలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తగిన రీతిలో స్పందించకపోవడంతో ఈ విషయాన్ని తాము మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన చొరవతో కేంద్ర రక్షణ, హోంశాఖలకు లేఖలు రాయగా, స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డ్ ద్వారా గాలింపు చర్యలను ముమ్మరం చేయడం అభినందనీయమని, ఇందుకు కేంద్రంతో పాటు వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. మత్స్యశాఖ వైఫల్యాలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కేంద్రం అందిస్తున్న భద్రతా ట్రాన్స్పాండర్లు లేకుండానే బోట్లు ఎలా సముద్రంలోకి వెళున్నాయో అధికారులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. వాడలరేవు ఘటనలో బోటుకు ట్రాన్స్పాండర్ లేకపోవడం వల్లే గాలింపు క్లిష్టంగా మారిందని, రెండేళ్ల క్రితమే సాంకేతిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదని మండిపడ్డారు. వాడలరేవులోనే 40 బోట్లకు లైసెన్సులు పెండింగ్‌లో ఉన్నాయని, లైసెన్సుల జారీలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలోని 8 లక్షల మంది మత్స్యకారుల్లో కేవలం 2 లక్షల మందికే బీమా ఉండటం దారుణమని, అర్హులందరికీ బీమా కల్పించడంతో పాటు ప్రమాదాలకు గురయ్యే ఫిషింగ్ బోట్లకు కూడా ప్రత్యేక బీమా సౌకర్యం కల్పించాలని, శాశ్వత సముద్ర భద్రతా విధానాన్ని తక్షణమే రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# పునఃనిర్మాణ పనులను పరిశీలించిన... ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల



**ఐ పోలవరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**

మురమళ్ల నిత్యకళ్యాణం పచ్చతోరణం విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి ఆలయ పునః నిర్మాణ పనులు ముమ్మిడివరం శాసన సభ్యులు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమీషనర్ వి.సత్యనారాయణ, ఆలయ సిద్ధాంతి బ్రహ్మశ్రీ యనమండ్ర సత్య సీతా రామ శర్మ, తోకలిసి శనివారం పరిశీలించారు. ప్రస్తుతం గర్భాలయ, అంతరాల, నంది మండపం సంబంధించి నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. అత్యంత అత్యంత చారిత్రాత్మక ఆలయం శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయం అని నిత్యం కొన్ని వేల మంది ఇక్కడికి వచ్చి కల్యాణాలు జరిపించుకొని మొక్కలు తీర్చుకుంటూ ఉంటారని ఆలయం తరచూ వర్షాలకు ముంపుకు గురవుతున్న కారణంగా పునః నిర్మాణం చేయవలసిన ఆవశ్యకత ఉందన్నారు. నిర్మాణానికి విరాళాలు అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు నాణ్యత ప్రమాణాలు,పాటిస్తూ పుష్కరాల సమయానికి పనుల పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఇంజనీరింగ్ విభాగ అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

# అగ్ని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శ

**– అండగా ఉంటామని భరోసా,**

**నిత్యవసరాలు నగదు పంపిణీ**



**మామిడి కుదురు సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామం బొమ్మిడివారిపాలెంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా నిన్న ఒక ఇల్లు అగ్నికి ఆహుతైంది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ శనివారం అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులను అందించడంతో పాటు కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. కష్టకాలంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అండగా ఉంటారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, జనసైనికులు, కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణాంధ్ర

**అయినవిల్లి, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**

అయినవిల్లి మండలంనేదునూరు గ్రామంలో లో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో అయినవిల్లి మండల అభివృద్ధి అధికారి జి .సరోవర రావు ఆధ్వర్యంలో నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలోఎంపీటీసీ సభ్యులు కల్లెపల్లి వెంకట సుబ్బరాజు ,మాజీ సర్పంచ్ గుమ్మడి వెంకటేశ్వర రావు ,టీడీపీ గ్రామ అధ్యక్షులు తమ్మన శ్రీనివాస్ , కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ అన్వర్ , పంచాయతీ సిబ్బంది, స్వర్ణ గ్రామం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.



## పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

**ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ హరీష్, ఎమ్మెల్యే సత్యనారాయణ**



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**

పట్టణంలోని గడియార స్తంభం వద్ద జరిగిన, సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్న పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి71 వ పుట్టినరోజు వేడుకకు ఎంపీ హరీష్ బాలయోగి హాజరయ్యారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన వారిని అభినందించారు. అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ ను కటింగ్ చేసి, పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ , మెట్ల రమణబాబు లతో కలిసి పేదలకు చీరలు దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో చందానగర్ ఎస్సై, కానిస్టేబుల్ లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన అధికారులు!



**శేరిలింగంపల్లి, సిటీజన్ టైమ్స్, ఆగష్టు 22**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని చందానగర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై బండెల బాలరాజ్, కానిస్టేబుల్/రైటర్ బొట్టా రాఘవేంద్ర కుమార్‌లు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రంగారెడ్డి రేంజ్ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ల్యాండ్ విషయంలో పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 696/2026 కేసులో విచారణ జరిపి చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు అధికారికంగా సహాయం చేయడానికి ఎస్సై బాలరాజ్ బాధితుడి నుంచి రూ. 75,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అంతకుముందే ఎస్సై బాలరాజ్ నగదు రూపంలో రూ. 20,000, కానిస్టేబుల్ రాఘవేంద్ర యూపీఐ పేమెంట్స్ ద్వారా రూ. 10,000 తీసుకున్నట్లు ఏసీబీ విచారణలో తేలింది. విధుల పట్ల అక్రమంగా ప్రవర్తించి లంచం డిమాండ్ చేసిన ఈ ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి హైదరాబాద్‌లోని ఎస్‌పీఈ అండ్ ఏసీబీ కేసులు విచారించే ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరచి జుడీషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీబీ వెల్లడించింది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా వాట్సాప్ (9440446106) ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఈ సందర్భంగా అధికారులు కోరారు.

## గల్లంతయిన మత్స్యకార కుటుంబాలను పరామర్శ

**నిత్యవసరాలు పంపిణీ చేసిన వైఎస్ఆర్సిపి శ్రేణులు**



**అల్లవరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**

మండలం లోని ఓడలరేవు సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి వైయస్ఆర్సీపీ శ్రేణులు పరామర్శించారు , వైసీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముమ్మిడివరం నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను అల్లవరం మండలం ఓడలరేవు గ్రామానికి వెళ్లి, ఇటీవల సముద్రంలోకి వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించి, వారికి భరోసా కల్పించారు. ఓడలరేవు గ్రామానికి చెందిన కోపనాతి రామకృష్ణవర్మతో పాటు మరో 6గురు మత్స్యకారులు ఆగస్టు 3న టోనా ఫిష్ వేట కోసం సముద్రంలోకి వెళ్లారు. ఆగస్టు 12న తిరిగి రావాల్సి ఉండగా, ఇప్పటివరకు వారి ఆచూకీ లభించకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అనంతరం బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులను అందజేసి, ఈ క్లిష్ట సమయంలో వారికి అండగా నిలిచారు. మత్స్యకారుల కుటుంబాల బాధను అర్థం చేసుకుని, వారి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు .ఈ కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు , మాజీ పార్లమెంట్ సభ్యురాలు చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ , అమలాపురం నియోజకవర్గ పరిశీలకులు కటకంశెట్టి ఆదిత్య, వంటెద్దు వెంకనాయుడు,గొవ్వల రాజేష్ , దొమ్మేటి రాము,కొనుకు బాపూజీ, ఇళ్ల శేషారావు, తదితరులు ఉన్నారు.

# గచ్చిబౌలిలో దారుణం: కుప్పకూలిన ఏడంతస్తుల భవనం ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు!

**హెచ్చరించినా స్పందించని యంత్రాంగం.. అధికారుల నిర్లక్ష్యమే ఇద్దరి ప్రాణాలను బలితీసుకుందా?**

**50 గజాల్లో ఏడంతస్తులా..? అనుమతులు లేకుండా ఇంత పెద్ద నిర్మాణం ఎలా సాధ్యమైంది?**







**శేరిలింగంపల్లి, సిటీజన్ టైమ్స్, ఆగష్టు 22**

గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో కేవలం 50 గజాల చిన్న విస్తీర్ణంలో నాలాపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఏడంతస్తుల అక్రమ భవనం శనివారం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘోర ప్రమాదంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి ఉపాధి కోసం వలస వచ్చిన ఉమేష్ ఖారే (34), మోపత్ (42) అనే ఇద్దరు అమాయక కూలీలు శిథిలాల కింద చిక్కుకుని దుర్మరణం పాలయ్యారు. భవనం కూలిన సమయంలో పక్కనే ఉన్న జయదర్శిని రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌కు చెందిన సంయుక్త, రమణ రెడ్డి తీవ్రంగా గాయపడటంతో పోలీసులు వారిని చికిత్స నిమిత్తం కేర్ ఆసుపత్రికి తరలించారు. నిబంధనలు పాటించకుండా ప్రమాదకరంగా నిర్మాణం చేపడుతున్నారని జయదర్శిని రెసిడెన్సీ వాసులు ముందే ఫిర్యాదు చేసినా.. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ విపత్తుకు కారణమంటు స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎన్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్, హైడ్రా, అగ్నిమాపక, పోలీసు బృందాలు ఘటనాస్థలికి చేరుకుని శిథిలాల తొలగింపుతో పాటు సహాయక చర్యలను వేగవంతం చేశాయి. మరోవైపు జీహెచ్ఎంసీ కమిషనర్ సృజన, హైడ్రా కమిషనర్ రంగనాథ్, స్థానిక ఎమ్మెల్యే గాంధీ ఘటనాస్థలాన్ని పరిశీలించి అక్రమ నిర్మాణాలకు పాల్పడిన వారితో పాటు నాలా ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం బిల్డర్ సాజిద్‌ను రాయదుర్గం పోలీసులు అదుపులోకి తీసుకుని అనుమతులు నిర్మాణ నాణ్యత అధికారుల వైఫల్యంపై సమగ్ర విచారణ జరుపుతున్నారు.

# తల్లి తర్వాత తల్లిలా అంగన్వాడి టీచర్లు, చిన్నారులను తీర్చిదిద్దుతున్నారు...

**కూటమి ప్రభుత్వం లో అంగన్వాడీలకు ప్రత్యేక గుర్తింపు...**

**నూతనంగా నియమితులైన అంగన్వాడీలకు నియామక పత్రాలు అందించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...**



**కొత్తపేట సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**

తల్లి తర్వాత తల్లిలా అంగన్వాడీ సెంటర్లలో అంగన్వాడి టీచర్లు, కార్యకర్తలు చిన్నారులను తీర్చిదిద్దుతున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనియాడారు. శనివారం కొత్తపేట మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా నియమితులైన అంగన్వాడీ కార్యకర్తలకు ఎమ్మెల్యే చేతులమీదుగా నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నియోజకవర్గంలో 30 మందికి నియామక పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. గ్రామాల్లో ఉన్న అన్ని ఉద్యోగాల కన్నా అంగన్వాడీ పోస్టులకు విలువ ఎక్కువన్నారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టిక ఆహారాన్ని అందిస్తూ, చిన్నారులను సాకుతూ గ్రామాల్లో అంగన్వాడీలు సేవలు అందిస్తారని కొనియాడారు. వారికి ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. అంగన్వాడీల తరపున ఒక ఎమ్మెల్సీ ఉండాలన్న ఉద్దేశంతో అనంతపురం జిల్లాకు చెందిన అంగన్వాడీల తరపున పోరాడిన ఒక వడ్డెర మహిళ దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 58,204 మందికి అంగన్వాడీ సిబ్బందికి రూ. 75 కోట్లతో 5జీ స్మార్ట్ ఫోన్లను అందించడం జరిగిందన్నారు. చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు, అంగన్వాడి సిబ్బంది సమర్థవంతంగా సేవలందిస్తున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీతాలు రూ. 8వేల నుంచి రూ. 11వేలకు పెంచడం జరిగిందన్నారు. రెండు మార్లు వేతనాలు పెంచడం జరిగిందన్నారు. ప్రతినెలా ఒకటవ తేదీనే జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. 5000 మినీ అంగన్వాడీలను అప్ గ్రేడ్ చేసి మేజర్ అంగన్వాడీలుగా మార్చడం జరిగిందన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో 24 మినీ అంగన్వాడీలను మేజర్ అంగన్వాడీలుగా మార్చడం జరిగిందన్నారు. గ్యాస్ సమస్యలు లేకుండా ఇండక్షన్ స్టవ్ లు అందించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగన్వాడీ కార్యకర్తల పిల్లలకు సైతం తల్లికి వందనం అందించారని తెలిపారు. ఈ విధంగా అంగన్వాడీ ఉద్యోగుల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## ముక్తేశ్వరం సెంటర్‌లో చిరంజీవి వేడుకలు



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**

మండలం లోని చిరంజీవి యువత ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించినారు. సందర్భంగాకేక్ కటింగ్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ కార్యక్రమం చేసారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథి అయినవిల్లి శ్రీ సిద్ధి వినాయక ఆలయ చైర్మన్ విళ్ల సూరయ్య కాపు కేక్ కట్ చేసినారు. ఈ కార్యక్రమంలో మద్దా చంటిబాబు,సలాది బుచ్చిరాజు అడపా వెంకట నాగభూషణం,మేడిద దుర్గాప్రసాద్, వార లక్ష్మీ నరసింహ,గోకరకొండ సత్యనారాయణ, దూనబోయిన శ్రీనివాస్, గొన్నూరి అన్నవరం, సరెళ్ల సత్యనారాయణ, అంబటి రాజు,పడాలగిరి అమరానానాజీ దామిశెట్టి గాంధీ ,పైబోడి సూరిబాబు,మాగాపు దొర, యడ్ల నాని,మెగా అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మా ఇల్లు - మా కుటుంబం - మన జిల్లా

**పరిసరాల పరిశుభ్రతపై బాధ్యత కలిగి ఉండాలి**

**కామనగరువులో 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై. నైడియా దేవి**

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**

మా ఇల్లు – మా కుటుంబం – మన జిల్లా జాగృతమై పరిసరాల పరిశుభ్రతపై బాధ్యత కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్.నైడియా దేవి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం అమలాపురం మండలం కామన గరువు గ్రామపంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, పరిశుభ్రత అనేది మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి పేర్కొన్నారు. పరిశుభ్రత అనేది ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛమైన గ్రామాలను నిర్మించగలమని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, అధికారులు, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో పరిసరాల పరిశుభ్రతపై స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛమైన గ్రామాలు, స్వచ్ఛమైన మండలాలు, స్వచ్ఛమైన జిల్లాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ గ్రామ పంచాయతీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికులతో జాయింట్ కలెక్టర్ నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి శాంతి కుమారి మాట్లాడుతూ జిల్లాలో అన్ని పంచాయతీలో బహిరంగ ప్రదేశాలలో శానిటేషన్ కార్యక్రమం ఎప్పటికప్పుడూ నిర్వహిస్తూ ఉన్నామని, మన జిల్లాలో జలాలను పవిత్రంగా పూజిస్తామని ఆమె తెలిపారు. అటువంటి జలాలను అపరిశుభ్రత కాకుండా పరిరక్షణ చేయాలని కోరారు.





'స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం లక్ష్యాలను గ్రామ స్థాయిలో విజయవంతంగా అమలు చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ ప్రజలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అమలాపురం డి ఎల్ డి ఓ విజయభాస్కర్, అమలాపురం తాసిల్దార్ దివాకర్ సర్పంచ్, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# క్లీన్ సిటీస్- గ్రీన్ కమ్యూనిటీస్ పై అవగాహన

## ముఖ్యఅతిథిగా ఎంపీ హరీష్ బాలయోగి





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకముగా చేపట్టిన "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమములో భాగంగా అమలాపురం పురపాలక సంఘ పరిధిలోని కల్వకొలను వీధి స్వర్ణ వార్డు వద్ద "క్లీన్ సిటీస్ - గ్రీన్ కమ్యూనిటీస్" ( పరిశుభ్రమైన నగరాలు - పచ్చని సమాజాలు) అనే ఇతివృత్తంతో పట్టణ ప్రజలకు, వ్యాపారులకు విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ద్వారా వాహనాలకు అందచేయాలని, కాలువలలో, రోడ్లు బహిరంగ ప్రదేశాలలో చెత్తను పడవేయకుండా పట్టణ ప్రజలు,పౌరులు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలియజేశారు.రాత్రి పగలు అనే తేడా లేకుండా పట్టణ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం పట్టణాన్ని అను నిత్యం అత్యంత పరిశుభ్రంగా ఉండేటట్లు కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రతి ఒక్కరు కృతజ్ఞతలు తెలియజేయాలని సూచించారు. పట్టణములో ప్రధాన వీధులను శుభ్రం చేయడానికి త్వరలో స్వీపింగ్ మిషన్ ను మంజూరు చేస్తానని పార్లమెంట్ సభ్యులు తెలియజేశారు.ఈ కార్యక్రమములో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ మాట్లాడుతూ పట్టణములో ద్రవ వ్యర్థాల నిర్వహణకు త్వరలో వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్లను నిర్మించి, వ్యర్థాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.పట్టణ ప్రజలు బాధ్యతగా వ్యవహరించి పట్టణ పరిశుభ్రతలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అమలాపురం డి.ఎస్.పి "టి ఎస్ ఆర్ కె ప్రసాద్" మాట్లాడుతూ కాలవలలో, రోడ్లు మీద,బహిరంగ ప్రదేశాలలో విచ్చల విడిగా వ్యర్థాలను పడవేసే వారిని గుర్తించి, వారిని పర్యావరణ చట్టాల ప్రకారం శిక్షించ వలసిన అవసరం ఉన్నదని, మున్సిపాలిటీ వారికి తమ డిపార్టుమెంటు ద్వారా పట్టణ పరిశుభ్రత కొరకు, పట్టణ ప్రజల ఆరోగ్యం కొరకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. తర్వాత అందరూ కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి ,మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ కె.సుబ్బారావు , అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు , తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణ బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్లు చిక్కాల గణేష్ , పెచ్చెట్టి విజయ లక్ష్మి, మాజీ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, స్వర్ణ వార్డు కార్యదర్శులు, మెప్మా సిబ్బంది మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ కార్డుల జారీ వెంటనే అమలు చేయాలి

### జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్టు 22**

నాగర్‌కర్నూల్ జిల్లాలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీలో జరుగుతున్న జాప్యాన్ని వెంటనే నివారించి, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు సకాలంలో అక్రిడిటేషన్ కార్డులు అందించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీ డబ్ల్యూ జేఎఫ్) నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి . వెంకట స్వామి నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ని కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్రిడిటేషన్ కమిటీల ప్రక్రియ పూర్తయి జర్నలిస్టులకు కార్డులు అందుతున్నప్పటికీ,నాగర్‌కర్నూల్ జిల్లాలో మాత్రం ప్రక్రియ ఆలస్యం కావడం వల్ల అనేక మంది జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలో ఇప్పటికే రెండోసారి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగినప్పటికీ, కొంతమందికి మాత్రమే కార్డులు అందడం,ఇంకా అనేక మంది జర్నలిస్టులు ఎదురుచూడాల్సి రావడం ఆందోళన కలిగిస్తోందన్నారు.అక్రిడిటేషన్ కార్డుల కోసం నెలల తరబడి ఎదురుచూసే పరిస్థితి నెలకొనడంతో జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ప్రభుత్వం,ప్రజలకు జర్నలిస్టులు వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నప్పటికీ, వారి సమస్యల పరిష్కారంలో మాత్రం నిర్లక్ష్యం తగదన్నారు.జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్,జిల్లా కలెక్టర్ ని కోరారు. పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా అక్రిడిటేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం కల్పించాలని,జర్నలిస్టుల పిల్లలకు కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందేలా చర్యలు తీసుకోవాలని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని పి. వెంకటస్వామి కోరారు. జర్నలిస్టుల సమస్యలపై స్పందించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ వెంటనే చర్య తీసుకోవాలని డీపీఆర్ఓ ను ఆదేశించారు.

# ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం






**కొత్తపేట సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**

విశ్వ కవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొత్తపేటలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ భారత అంతరిక్ష పరిశోధనలో ఒక చారిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. 2023 ఆగస్టు 23న విక్రమ్ ల్యాండర్ చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతంలో విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ చేయడం ద్వారా భారత్ ప్రత్యేక ఘనతను సాధించిందన్నారు. చంద్రయాన్-3 ద్వారా చంద్రుని ఉపరితలంలోని సల్ఫర్ సహా పలు మూలకాలు, ఉష్ణోగ్రత, ప్లాస్మా వాతావరణం తదితర అంశాలపై విలువైన శాస్త్రీయ సమాచారాన్ని సేకరించామని వివరించారు. "స్పేస్ అంటే మనకు దూరమైన విషయం కాదు; అది మీ భవిష్యత్ కెరీర్‌కు ఒక అవకాశంగా కూడా మారవచ్చు" అని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సంవత్సరం జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం నిర్దేశించిన టచ్చింగ్ లైవ్ వైల్డ్ టచింగ్ ద మూన్ అనే థీమ్‌ను ప్రస్తావిస్తూ, చంద్రుడిని చేరుకోవడంతో పాటు అంతరిక్ష సాంకేతికత ద్వారా ప్రతి భారతీయుడి జీవితాన్ని మెరుగుపరచడమే భారత అంతరిక్ష కార్యక్రమాల లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఇతర అధ్యాపకులు కూడా మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రశ్నించే తత్వం, పరిశీలన, తార్కిక ఆలోచన, ఆధారాలతో విషయాలను అర్థం చేసుకునే అలవాట్లు చిన్న వయస్సు నుంచే అలవరచుకుంటే భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలు, పరిశోధకులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగగలరని తెలిపారు. మూఢనమ్మకాల కంటే శాస్త్రీయ ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కె. సత్యనారాయణ, గణితశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ డి.సి.హెచ్. పాపారావు,జంతుశాస్త్ర అధ్యాపకులు బి. విజయ్ కుమార్, తిమోతి, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు కె.ఎస్.ఎన్. ప్రసాద్, భౌతికశాస్త్ర అధ్యాపకులు కె. సాయి లక్ష్మి, సాయి, సిద్ధార్థ, శ్రీలక్ష్మి, హేమలత, దీపికా దేవి, సిహెచ్. విజయ్ కుమార్, సుధాకర్ తదితర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏపీపీఎస్సీ స్కాంను కప్పిపుచ్చుకోవడానికే డీఎస్సీపై జగన్ అసత్య ప్రచారాలు

### మంత్రి కొలుసు పార్థసారథి


**నూజివీడు, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 22:**



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే, కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా చేపట్టిన మెగా డీఎస్సీపై జగన్, ఆయన పార్టీ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు ఏపీపీఎస్సీ గ్రూప్-1 వ్యవహారంలో జరిగిన అవకతవకలపై హైకోర్టు నియమించిన సిట్ నివేదికపై బహిరంగ చర్చకు రావాలని వైఎస్సార్‌సీపీ అధినేతకు మంత్రి సవాల్ విసిరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా గ్రూప్-1 పరీక్షా పత్రాలను ప్రైవేట్ రిసార్టుకు తరలించి, ప్లంబర్లు, కూలీలు, పరీక్ష రాసిన వారి కుటుంబ సభ్యులతో మూల్యాంకనం చేయించారని మంత్రి ఆరోపించారు. వైట్నర్ వాడటం, డూప్లికేట్ ఓఎంఆర్ షీట్లు తయారు చేయడం వల్ల అర్హులైన పేద విద్యార్థులు నష్టపోయారని, సీఎఫ్ఎస్ఎల్ నివేదిక ప్రకారం ఎంపికైన 165 మందిలో 95 శాతం మంది పత్రాల్లో అవకతవకలు బయటపడ్డాయని పేర్కొన్నారు. తాము అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకంతో 16,347 పోస్టులతో మెగా డీఎస్సీని పట్టాలెక్కించామని, యువతకు ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఐదేళ్ల పాలనలోని తప్పులు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతోనే 11 మంది ఎమ్మెల్యేలున్నా జగన్ అసెంబ్లీకి రాకుండా పారిపోతున్నారని మంత్రి విమర్శించారు.

# కిమ్స్ లో అంకాలజీ సేవలు -మేనేజింగ్ డైరెక్టర్ రవి కిరణ్ వర్మ

**అమలాపురం. సిటిజెన్ టైమ్స్ ఆగస్టు 22**



త్వరలో జిల్లా ప్రజలకు మెరుగైన అంకాలజీ వైద్యసేవలు అందించేందుకు అమలాపురం కిమ్స్ ఆసుపత్రి సన్నద్ధమైనట్లు కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రవికిరణ్ వర్మ తెలిపారు.కిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో త్వరలోనే ప్రారంభం అయ్యే ఆంకాలజీ విభాగంలో మెడికల్ అంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ,రేడియేషన్ ఆంకాలజీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఆయన వెల్లడించారు.కోనసీమ ప్రజలకు ఆధునిక అంకాలజీ వైద్యం చేరువచేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.నూతనంగా ఏర్పాటు చేసిన కిమ్స్ ఆసుపత్రి అంకాలజీ విభాగ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ను ఆరంభ దశలోనే గుర్తించి చికిత్స అందివ్వడం ద్వారా పూర్తిగా నయం చేయవచ్చునని వెల్లడించారు.విదేశాలనుంచి ఆత్యాధునిక ఎక్విప్మెంట్ ను తీసుకురావడంతో పాటు అనుభవజ్ఞులైన ఆంకాలజీ వైద్య నిపుణులు నిరంతర వైద్యసేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పుట్టిపెరిగిన ప్రాంత ప్రజలకు అందుబాటులో ఆధునిక వైద్య సేవలు సమీపంలోనే అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు.కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) మార్గదర్శకంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.సమావేశంలో అంకాలజీ వైద్య నిపుణులు, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

# సమస్య శాంతియుతంగా పరిష్కారం

### నర్సింగ్ విద్యార్థుల మధ్య చిన్నపాటి విభేదాలు

### సమస్య పూర్తిగా పరిష్కృతం, విద్యార్థులందరూ సురక్షితం

### జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**



నగరం పరిధిలోని ఒక నర్సింగ్ కళాశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య తలెత్తిన చిన్నపాటి వివాదం పూర్తిగా పరిష్కారమైందని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తో కలిసి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జరిగిన ఒక ఫోన్ దొంగతనం సంఘటనకు సంబంధించి ఈశాన్య రాష్ట్రాలకు (మణిపూర్, నాగాలాండ్) చెందిన నర్సింగ్ విద్యార్థులకు, స్థానిక తెలుగువిద్యార్థులకు మధ్య చిన్నపాటి అపార్థాలు, ఆరోపణలు చోటుచేసుకున్నాయని, మొబైల్ ఫోన్ ఇప్పటికే రికవరీ అయి సంబంధిత విద్యార్థికి చేరిందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ విషయం జిల్లా యంత్రాంగానికి తెలిసిన వెంటనే ఎస్పీ తో పాటు స్థానిక సీఐ, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐలు,ఆర్ డి ఓ మరియు డీఎంహెచ్ఓ లు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాల విద్యార్థులతో మాట్లాడి సమస్యను శాంతియుతంగా పరిష్కరించారన్నారు. సోషల్ మీడియాలో ప్రచారమవుతున్నట్లుగా సర్టిఫికేట్ల దొంగతనం, ఫీజుల చెల్లింపు నిలిపివేత లేదా విద్యార్థుల తొలగింపు వంటి వార్తల్లో ఎలాంటి నిజం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థుల భద్రత దృష్ట్యా వారికి సమీపంలోని సురక్షిత ప్రాంతంలో అన్ని సౌకర్యాలతో కూడిన తాత్కాలిక వసతి,ఆహారం ఏర్పాటు చేశామని తెలిపారు.విద్యార్థుల మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని,హాస్టల్ సౌకర్యాలు మెరుగు పరచాలని కళాశాల యాజమాన్యానికి స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశామన్నారు.ఇతర రాష్ట్రాల నుంచి చదువు కోవడానికి వచ్చిన పిల్లల రక్షణకు జిల్లా యంత్రాంగం పూర్తి బాధ్యతవహిస్తుందని, తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారు.

# వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు




**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 22**

ఇంజనీరింగ్ విద్యార్థులు చదువుతోపాటు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగడం ద్వారా నూతన ఆవిష్కరణలు చేయవచ్చునని బీవీసీ చైర్మన్ బోనం కృష్ణ సతీష్, అక్షర మేనేజింగ్ డైరెక్టర్ బోనం విజయలక్ష్మిలు పేర్కొన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో స్పార్క్ 6.0 ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ బూట్‌క్యాంప్ శనివారంతో విజయవంతంగా ముగిసింది. ఆర్టీఐహెచ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఈనెల 17న ప్రారంభమైన బూట్ క్యాంప్ 22 వరకు నిర్వహించారు. విద్యార్థుల్లో వ్యవస్థాపక దృక్పథం,వినూత్న ఆలోచనలు, సమస్యల పరిష్కార సామర్థ్యాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కృష్ణ సతీష్ వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు,ఈడీసీ కోఆర్డినేటర్ డాక్టర్ బీహెచ్ పవన్ సమన్వయంతో కార్యక్రమం నిర్వహించారు.ఆర్టీఐహెచ్ సీఈఓ షేక్ యాసీన్ షరీఫ్, ప్రోగ్రాం అసోసియేట్స్ టి. శ్రీనివాస్,పి.మోహన్ దుర్గా ప్రసాద్,మెంటార్ శ్రీధర్ పి.నాయుడు పాల్గొని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించి విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించారు.సమస్యల పరిష్కారం,మార్కెట్ అవగాహన,వ్యవస్థాపక నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక తరగతులు నిర్వహించారు.

# సమస్యల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో మేలు

**అమలాపురం, సిటిజన్ టైం ఆగస్టు 22**

సమస్యల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో మేలని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ రాజమహేంద్రవరం కార్యదర్శి, సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి వై. శ్రీలక్ష్మి పేర్కొన్నారు.గ్రామస్తుల మధ్య ఉండే చిన్నపాటి గొడవలు,భూ వివాదాలు వంటి వాటిని రాజీ మార్గంలో గ్రామంలోనే పరిష్కరించుకుంటూ లిటిగేషన్ ఫ్రీ విలేజ్ గా ఇమ్మిడివరప్పాడు గ్రామం నిలవడం అభినందనీయమన్నారు. ఇమ్మిడివరప్పాడు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక అధికారి,సీడీపీవో వైకేడీ రమాదేవి అధ్యక్షతన జ్యూడిషియల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో శనివారం లీగల్ అవేర్నెస్ క్యాంపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సివిల్ జడ్జి శ్రీలక్ష్మి ఇమ్మిడివరపాడు గ్రామాన్ని లిటిగేషన్ ఫ్రీ విలేజ్ గా గుర్తించారు.గ్రామాల్లో సమస్యలు ఉంటాయి వాటిని పరిష్కరించుకునే మార్గాలు కూడా ఉంటాయని గ్రామస్తులకు దిశా నిర్దేశం చేశారు.మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం ద్వారా విలువైన సమయంతో పాటు ఆర్థిక నష్టాన్ని తగ్గించుకోవచ్చునని ఆమె సూచించారు.ఎల్ ఏ డి సి న్యాయవాదులు జె.వి.వి. రమణ,వై.వి.ఫణీంద్ర, జి. ఉదయ్ కుమార్,పి.విజయభాస్కర్ బాబులు పాల్గొని సమస్యల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ప్యానల్ లాయర్స్ కేవివి శ్రీనివాసరావు, ఎం.అచ్యుతానందరావు,ఎం. కిరణ్,పారా లీగల్ వాలంటీర్ బొక్కా గంగా శివకుమార్, ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, డిప్యూటీ తాసిల్దార్ ఎంబి ఆలీ, తాలూకా ఎస్సై ఏ.చైతన్య కుమార్,పంచాయతీ కార్యదర్శి ఎన్ ఎస్ వి శ్రీనివాస్,విఆర్ఓ వి. శ్రీనివాస్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంద గెద్దయ్య,ఎస్ మల్లేశ్వర రావు,జ్యుడీషియల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## రోజూ గుడ్డు తింటే క్యాన్సర్ వస్తుందా?



గత కొన్ని రోజులుగా గుడ్ల గురించి సోషల్ మీడియాలో ఓ వార్త చక్కర్లు కొడుతుంది. కొన్ని బ్రాండ్ల గుడ్లలో నైట్రోఫ్యూరాన్ అనే నిషేధిత యాంటీబయాటిక్ అవశేషాలు అధికంగా ఉన్నాయని, ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని కలిగిస్తుందని చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా గుడ్ల గురించి సోషల్ మీడియాలో ఓ వార్త చక్కర్లు కొడుతుంది. కొన్ని బ్రాండ్ల గుడ్లలో నైట్రోఫ్యూరాన్ అనే నిషేధిత యాంటీబయాటిక్ అవశేషాలు అధికంగా ఉన్నాయని, ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని కలిగిస్తుందని చెబుతున్నారు. ఈ క్రమంలో ఖీూూా× ఈ విషయంపై కీలక ప్రకటన వెలువరించింది. ఈ ప్రకటనలో ఏముందో, గుడ్లు తినడం వల్ల నిజంగా క్యాన్సర్ వస్తుందో లేదో ఇక్కడ తెలుసుకుందాం.. గుడ్లు ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాల నిధి. వాటిలో విటమిన్ ఎ, బి12, డి, ఇ, ఐరన్, జింక్, కోలిన్ వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి కండరాలను బలోపేతం చేస్తాయి. అవి మంచి కంటి చూపును కాపాడుతాయి. ఎముకలను బలోపేతం చేస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అందుకే రోజుకు 1-2 గుడ్లు తినడం చాలా మందికి ప్రయోజనకరంగా ఉంటుంది. వైద్యుల అభిప్రాయం ప్రకారం, గుడ్లు పూర్తి ప్రోటీన్ మూలం. అవి కండరాలను నిర్మించడానికి, మెదడు ఆరోగ్యానికి, కళ్ళకు మంచివి. ఖీూూా× నివేదిక గుడ్లపై వస్తున్న పుకార్లను కొట్టిపారేసింది. ప్రతిరోజూ గుడ్లు తినడం వల్ల ఏ రకమైన క్యాన్సర్ రాదని స్పష్టం చేసింది. గుడ్లలో మెదడు, కాలేయానికి అవసరమైన కోలిన్ ఉంటుందని తెలిపింది. ఇది స్త్రీలు, పిల్లలకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. క్యాన్సర్ పుకార్ల కారణంగా భయపడాల్సిన అవసరం లేదని తెలిపింది. దేశంలో విక్రయిస్తున్న గుడ్లు పూర్తిగా సురక్షితమైనవని ఖీూూా× పేర్కొంది. గుడ్లు తినడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం లేదు. ఈ వాదనలు తప్పుదారి పట్టించేవి. వాటికి ఎలాంటి శాస్త్రీయ ఆధారం లేదు. ఖీూూా× ప్రకారం కోళ్ల ఉత్పత్తి, గుడ్ల ఉత్పత్తిలో నైట్రోఫ్యూరాన్ వాడకం పూర్తిగా నిషేధించబడింది. శాస్త్రీయ ఆధారాల ప్రకారం నైట్రోఫ్యూరాన్ తక్కువ మొత్తంలో తీసుకోవడం వల్ల క్యాన్సర్ లేదా ఏదైనా ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం లేదు. ఉడికించిన లేదా వేయించిన గుడ్లు ఎలా తీసుకున్నా మంచిదే. అయితే వేయించిన గుడ్లను తక్కువగా తినాలి. ఎందుకంటే గుడ్లు వేయించడానికి నూనెను ఉపయోగిస్తారు. ఉడికించిన కూరగాయలతో కలిపిన గుడ్లను తినడం ఎల్లప్పుడూ శరీరానికి మంచిది.

## టమోటాలు ఎక్కువగా తింటున్నారా?



టమోటాలను చాలా మంది ఇష్టంగా తింటారు.. కూరగా అలాగా చట్నీగా తింటారు.. అలాగే.. పప్పుతోపాటు అనేక రకాల వంటల్లో టామాటాలను వేస్తారు.. ఇవి కూర రుచిని మరింత పెంచుతాయి.. అయితే.. టమోటాలు అధికంగా తీసుకోవడం వల్ల మీ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని, కొన్ని ఆరోగ్య సంబంధిత సమస్యలను ఎదుర్కోవలసి రావచ్చని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.. టమోటాలు పోషకాలతో నిండి ఉంటాయి. టమోటాల్లోని విటమిన్లు, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు ఆరోగ్యంగా ఉండేందుకు సహాయపడతాయి.. కానీ టామాటలను ఎక్కువగా తీసుకోవడం వల్ల మీ ఆరోగ్యంపై సానుకూల ప్రభావాలకు బదులుగా ప్రతికూల ప్రభావాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.. అదుకే.. కొంతమంది టమోటాలను నివారించాలని కూడా సలహా ఇస్తారు. ఎక్కువ టమోటాలు తినడం వల్ల పేగు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఆమ్లత్వం – ఉబ్బరం వంటి కడుపు సమస్యలను నివారించడానికి.. పరిమితుల్లో టమోటాలు తినాలని సూచిస్తున్నారు. టమోటాలు ఎక్కువగా తినే వ్యక్తులు ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ లక్షణాలను అనుభవించవచ్చు. ఇంకా, టమోటాలు ఆమ్లత్వం, గుండెల్లో మంట వంటి సమస్యలను కూడా కలిగిస్తాయి. మీకు ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ ఉంటే, మీరు టమోటాలు తినకుండా ఉండాలి. మీకు ఎసిడిటీ, గుండెల్లో మంట ఉంటే టమోటాలు తినకుండా ఉండటం కూడా మంచిది. వాస్తవానికి టమోటాలు ఆమ్ల స్వభావం కలిగి ఉంటాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, టమోటాలను పెద్ద పరిమాణంలో తీసుకోవడం వల్ల మూత్రాశయ చికాకు వస్తుంది. మీరు అలాంటి సమస్యలతో బాధపడకూడదనుకుంటే, టమోటాలను ఎక్కువగా తినడం మానుకోండి.. లేకుంటే మీరు తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది. టమోటాలు సరైన పరిమాణంలో, సరైన పద్ధతిలో తీసుకుంటేనే అవి మీ ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటాయి.టమోటా గింజలు కిడ్నీలో రాళు ఏర్పడే ప్రమాదాన్ని పెంచుతాయి. అందుకే కిడ్నీలో రాళ్లు ఉన్నవారు టమోటాలకు దూరంగా ఉండటం మంచిది. ఇంకా, పెద్ద మొత్తంలో టమోటాలు తినడం వల్ల అలెర్జీ ప్రతిచర్యలు కూడా వస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే.. ఏదైనా మితంగా తీసుకుంటే మంచిదని.. ఎక్కువగా తీసుకుంటే హాని తప్పదంటూ పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు.. ఏమైనా అనారోగ్య సమస్యలుంటే వైద్యులను సంప్రదించడం మంచిది.

## సులువుగా బరువు తగ్గాలా?

నేటి కాలంలో అనారోగ్యకరమైన ఆహారం, నిశ్చల జీవనశైలి కారణంగా బరువు పెరగడం సర్వసాధారణమైపోయింది. దీంతో బరువు తగ్గడం, ఫిట్‌గా, స్లిమ్‌గా మారడం చాలా మందికి సవాలుగా మారింది. అయితే ఇవన్నీ ప్రయత్నించినప్పటికీ బరువు తగ్గడం లేదని చాలా మంది ఫిర్యాదు చేస్తుంటారు. నేటి కాలంలో అనారోగ్యకరమైన ఆహారం, నిశ్చల జీవనశైలి కారణంగా బరువు పెరగడం సర్వసాధారణమైపోయింది. దీంతో బరువు తగ్గడం, ఫిట్‌గా, స్లిమ్‌గా మారడం చాలా మందికి సవాలుగా మారింది. అయితే ఇవన్నీ ప్రయత్నించినప్పటికీ బరువు తగ్గడం లేదని చాలా మంది ఫిర్యాదు చేస్తుంటారు. ఇదేవిధంగా మీరు కూడా బరువు తగ్గడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారా? అయితే మీ ఉదయం దినచర్యలో ఈ కింది కొన్ని అలవాట్లను అలవాటు చేసుకుంటే చాలు.. సులువుగా బరువు తగ్గిపోతారు. ఉదయం నిద్రలేచిన వెంటనే ఒకటి నుంచి రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లు తాగాలి. ఈ అలవాటు శరీర జీవక్రియను సక్రియం చేస్తుంది. నిర్జలీకరణాన్ని తొలగిస్తుంది. గోరువెచ్చని నీళ్లు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. శరీరం నుంచి విషాన్ని బయటకు పంపుతుంది. జీవక్రియ రేటును పెంచుతుంది. నీటిలో నిమ్మరసం, తేనె, చిన్న అల్లం ముక్కను కూడా జోడించవచ్చు. ఇది కొవ్వును కరగతీసే ప్రక్రియను వేగవంతం చేయడంలో సహాయపడుతుంది. విటమిన్ డి పొందడానికి ఉదయం ఎండలో కొంత సమయం గడపడం చాలా అవసరం. అంతేకాకుండా కనీసం 15-20 నిమిషాలు ఎండలో గడపడం వల్ల శరీర సిర్కాడియన్ లయను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది జీవక్రియ, ఆకలిని నియంత్రించే హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. ఇది రోజంతా శక్తి స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుంది. అనారోగ్యకరమైన ఆహారాల తినాలనే కోరికలను తగ్గిస్తుంది. ఇది బరువు తగ్గడానికి మీకు సహాయపడుతుంది. ఉదయం అల్పాహారం రోజులో అతి ముఖ్యమైన భోజనం. ప్రోటీన్ అధికంగా ఉండే అల్పాహారం బరువు తగ్గడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రోటీన్ ఎక్కువసేపు ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది రోజంతా అనారోగ్యకరమైన చిరుతిండిని తగ్గిస్తుంది. గుడ్లు, పెరుగు, జున్ను, చిక్కుళ్ళు వంటి ఆహారాలను మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కండరాలు బలపడతాయి. జీవక్రియ పెరుగుతుంది. ఉదయం వ్యాయామం చేయడం వల్ల శరీర జీవక్రియ పెరుగుతుంది. జాగింగ్, సైక్లింగ్, స్కిప్పింగ్, సూర్య నమస్కారం, కపలాభతి ప్రాణాయామం వంటి తేలికపాటి యోగాసనాలు, కార్డియో వ్యాయామాలు కొవ్వును కరిగించడంలో చాలా ప్రభావవంతంగా ఉంటాయి. అలాగే ఈ ఉదయం అలవాట్లు మిమ్మల్ని రోజంతా చురుకుగా ఉంచుతాయి.



## కలోంజి ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదిలిపెట్టరు



కలోంజి లేదా నల్ల జీలకర్ర గింజలు నల్లగా.. చూడటానికి పరిమాణంలో చిన్నగా ఉండవచ్చు.. కానీ దాని ప్రయోజనాలు అపారమైనవి. రోగనిరోధక శక్తిని పెంచడం నుండి గుండె, జీవక్రియ, వాపును నియంత్రించడం వరకు, ఇది శరీరానికి అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుస్తుందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. మన వంటగదిలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్న అనేక పదార్థాలు, దినుసులు ఉంటాయి.. అలాంటి వాటిలో.. కలోంజి (నల్ల జీలకర్ర లేదా నిగెల్లా గింజలు) ఒకటి..

కలోంజి శతాబ్దాలుగా ఆయుర్వేదంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయి. ఇది అసాధారణంగా అనిపించినప్పటికీ, దానిలో దాగి ఉన్న ఔషధ గుణాలు దీనిని సూపర్‌ఫుడ్‌గా చేస్తాయి. హెల్త్‌లైన్ ప్రకారం, ఈ నల్ల గింజలలోని బయోయాక్టివ్ సమ్మేళనాలు, యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని అనేక తీవ్రమైన వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడతాయి. అలాగే.. కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం నుండి రోగనిరోధక శక్తిని పెంచడం, మంటను తగ్గించడం వరకు దీని ప్రయోజనాలు ఉంటాయి. కలోంజి గింజల్లో లభించే సమ్మేళనాలు యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటాయి. కొన్ని శాస్త్రీయ అధ్యయనాలు సాధారణ మందులకు స్పందించని బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా నల్ల గింజలు ప్రభావవంతంగా ఉన్నాయని చూపించాయి. హెల్త్‌లైన్ ప్రకారం, సరైన మొత్తంలో తీసుకుంటే.. ఇది ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి, శరీరం రోగనిరోధక రక్షణను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. నల్లగా ఉండే కలోంజి గింజల్లో థైమోక్వినోన్, కార్వాక్రోల్, టి-అనెథోల్, 4-టెర్పినోల్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ సమ్మేళనాలు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడంలో సహాయపడతాయి. ఫ్రీ రాడికల్స్ కణాలను దెబ్బతీస్తాయి.. క్యాన్సర్, గుండె జబ్బులు, అకాల వృద్ధాప్యం వంటి దీర్ఘకాలిక సమస్యలకు దారితీయవచ్చు. ఈ రాడికల్స్ వల్ల కలిగే ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి ఈ గింజలు సహాయపడతాయి. నల్ల జీలకర్రలోని కొన్ని సమ్మేళనాలు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించవచ్చని, కొన్ని సందర్భాల్లో వాటిని తొలగించవచ్చని అధ్యయనాలు చూపించాయి. దీని యాంటీఆక్సిడెంట్, బయోయాక్టివ్ సమ్మేళనాలు క్యాన్సర్ కణాల వ్యాప్తిని (మెటాస్టాసిస్) నెమ్మదిస్తాయి. భవిష్యత్తులో క్యాన్సర్ నివారణలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో దీర్ఘకాలికంగా వాపు అనేది మధుమేహం, గుండె జబ్బులు, ఆర్థరైటిస్ వంటి అనేక వ్యాధులకు మూల కారణం. నల్ల జీలకర్రలోని శోథ నిరోధక లక్షణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. దీన్ని క్రమం తప్పకుండా.. మితంగా తీసుకోవడం వల్ల శరీరంలో కొనసాగుతున్న శోథ ప్రక్రియను నియంత్రించడంలో సహాయపడుతుంది. కలోంజీ కొలెస్ట్రాల్‌ను మాత్రమే కాకుండా రక్తంలో చక్కెర స్థాయిలను కూడా సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. కొన్ని పరిశోధనలు ఇది కాలేయ ఆరోగ్యానికి మద్దతు ఇస్తుందని.. జీవక్రియ సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడుతుందని సూచిస్తున్నాయి. డయాబెటిస్ – ఫ్యాటీ లివర్ వంటి పరిస్థితులకు ఇది సహాయక ఆహారంగా కూడా పనిచేస్తుంది. మీరు నల్ల జీలకర్ర గింజలను కూరగాయలు, పప్పులు, సలాడ్లు లేదా పిండితో కలిపి తినవచ్చు. కొంతమంది ఉదయం ఖాళీ కడుపుతో విత్తనాలను నమలడం లేదా దాని నూనెను తీసుకోవడం కూడా చేస్తారు. రాత్రి పూట నీటిలో నానబెట్టి.. ఉదయాన్నే తినవచ్చు.. అలాగే.. ఆ నీటిని తాగవచ్చు.. అయితే, మరేదైనా పదార్థాల మాదిరిగానే, దీనిని మితంగా, అవసరమైతే వైద్యుడి సలహా మేరకు తీసుకోవడం మంచిది.

## అత్యంత అరుదైన పింక్ డైమండ్



ఆమె ఒక ప్రముఖ వ్యాపారవేత్త భార్య మాత్రమే కాదు, ప్రపంచ వేదికలపై భారతీయ ఫ్యాషన్ కు దిక్సూచిలా నిలిచే గ్లోబల్ ఐకాన్. సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసే ఫోటోలు క్షణాల్లో వైరల్ అవుతుంటాయి. అయితే తాజాగా ఒక వేడుకలో ఆమె ధరించిన ఒక చిన్న. ఆమె ఒక ప్రముఖ వ్యాపారవేత్త భార్య మాత్రమే కాదు, ప్రపంచ వేదికలపై భారతీయ ఫ్యాషన్ కు దిక్సూచిలా నిలిచే గ్లోబల్ ఐకాన్. సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసే ఫోటోలు క్షణాల్లో వైరల్ అవుతుంటాయి. అయితే తాజాగా ఒక వేడుకలో ఆమె ధరించిన ఒక చిన్న ఉంగరం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఆ ఉంగరంలో మెరుస్తున్న పింక్ డైమండ్ చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ఎందుకంటే అది సాదాసీదా వజ్రం కాదు.. ప్రపంచంలోనే అత్యంత అరుదైన వజ్రాలలో ఒకటి. ఇంతకీ ఆ వజ్రం ప్రత్యేకత ఏంటి? ఆ సోషల్ మీడియా సెన్సేషన్ ఎవరు? వజ్రాలన్నింటిలోనూ పింక్ డైమండ్స్ చాలా అరుదుగా లభిస్తాయి. ఆస్ట్రేలియాలోని ఆర్గిల్ గని మూతపడిన తర్వాత వీటి లభ్యత మరింత తగ్గిపోయింది. తాజాగా ఈ స్టార్ సెలబ్రిటీ వేలికి మెరుస్తున్న ఈ వజ్రం దాదాపు 10 క్యారెట్ల కంటే ఎక్కువ బరువు ఉంటుందని అంచనా. దీని రంగు, స్వచ్ఛత పరంగా చూస్తే ఇది అత్యంత నాణ్యమైన వజ్రంగా నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక క్యారెట్ పింక్ డైమండ్ ధర కోట్లలో ఉంటుంది. అంటే ఈ ఉంగరం ధర ఊహకందని స్థాయిలో ఉంటుందని స్పష్టమవుతోంది. కేవలం ఉంగరమే కాదు, ఆమె ధరించే ప్రతి వస్తువులోనూ ఒక ప్రత్యేకత ఉంటుంది. విదేశీ పర్యటనల్లో ఆమె వేసుకునే దుస్తులు, చేతిలో ఉండే బ్యాగులు అన్నీ ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్లకు చెందినవే. లండన్, ముంబై నగరాల్లో విలాసవంతమైన భవంతుల్లో నివసించే ఈమె, బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు అందరితోనూ మంచి స్నేహసంబంధాలను కలిగి ఉంటుంది. ఫ్యాషన్ ప్రపంచంలో ఆమెను ‘క్వీన్ ఆఫ్ లగ్జరీ’ అని పిలుచుకోవడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. ప్రపంచాన్ని తన ఫ్యాషన్ తో ఆకట్టుకుంటున్న ఆ సెలబ్రిటీ మరెవరో కాదు.. సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధినేత అదర్ పూనావాలా భార్య నటాషా పూనావాలా! రీసెంట్‌గా ఆమె షేర్ చేసిన ఫోటోల్లో ఈ పింక్ డైమండ్ రింగ్ హైలైట్‌గా నిలిచింది. ఈ ఉంగరం ధర కొన్ని వందల కోట్లలో ఉండవచ్చని సమాచారం. గతంలో జరిగిన హాంకాంగ్ వేలంలో ఇలాంటి పింక్ డైమండ్ రింగ్ దాదాపు రూ. 580 కోట్లకు అమ్ముడైందంటే, నటాషా దగ్గర ఉన్న ఈ వజ్రం విలువ ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అరుదైన వజ్రాలను సేకరించడం నటాషా పూనావాలాకు ఉన్న అభిరుచుల్లో ఒకటి. ఈ పింక్ డైమండ్ రింగ్ ఆమె రాయల్ కలెక్షన్‌లో మరో మణిహారంగా చేరింది. ఏది ఏమైనా, ఆమె ఫ్యాషన్ సెన్స్ మరియు ఆ విలాసవంతమైన జీవనశైలి చూసి నెటిజన్లు ముక్కున వేలేసుకుంటున్నారు!

# ట్రెండ్‌గా మారుతున్న జాంబీ సినిమాలు!



స్టైలిష్ గ్రే క్రాప్ టాప్ లుక్‌లో ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తున్న ప్రియాంక ఖోల్గాడే






సాంప్రదాయక రూపంలో శ్రియా శరణ్ కాలాతీతమైన హుందాతనాన్ని ప్రదర్శిస్తున్నారు

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు చిత్ర పరిశ్రమలో ఎప్పటికప్పుడు కొత్త జోనర్స్ తెరపైకి వస్తున్నాయి. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడానికి దర్శకులు విభిన్నమైన కాన్సెప్ట్‌లతో ప్రయోగాలు చేస్తున్నారు. ఆ కోవలోనే కొన్ని సంవత్సరాల క్రితం టాలీవుడ్‌లో ప్రశాంత్ వర్మ అద్భుతమైన సృజనాత్మకతతో తెరకెక్కించిన -జాంబీ రెడ్డి- సినిమాతో హర్రర్-కామెడీ జాంబీ కాన్సెప్ట్ అధికారికంగా పరిచయమైంది. తెలుగు ప్రేక్షకులకు పూర్తిగా కొత్తనైన జానర్‌ను దర్శకుడు అత్యంత వినోదాత్మకంగా మలచడంతో ఈ ప్రయోగం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. -జాంబీ రెడ్డి- సృష్టించిన ట్రెండ్ ఒక చిత్రంతో ఆగిపోకుండా ఇండియన్ స్క్రీన్ మీద సరికొత్త ట్రెండ్‌గా వేగంగా మారుతోంది. భయంతో పాటు కడుపుబ్బా నవించే కామెడీని మిక్స్ చేసి తెరకెక్కించే జాంబీ జోనర్‌పై నేటి యువ ప్రేక్షకులు మంచి ఆసక్తి చూపిస్తున్నారు. హాలీవుడ్ సినిమాలకు మాత్రమే పరిమితం అనుకున్న జాంబీ కాన్సెప్ట్‌ను భారతీయ నైటివిటీకి తగ్గట్టుగా మార్చి తెరపై ఆవిష్కరిస్తుండటంతో మేకర్స్‌కు కూడా కొత్త అవకాశాలు కలుగుతున్నాయి.ఈ విజయవంతమైన బాటలోనే ఇప్పుడు మరిన్ని భారీ ప్రాజెక్ట్‌లు ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమ వుతున్నాయి. -జాంబీ రెడ్డి- చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న -జాంబీ రెడ్డి 2-పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. ఈసారి మరింత విస్తృతమైన గ్రాఫిక్స్ .. వినోదంతో సినిమాను తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగం కంటే రెండవ భాగం మరింత వైవిధ్యంగా ఉంటుందని ప్రేక్షకులను సీట్లలో కూర్చోబెట్టేలా అదిరిపోయే హర్రర్-కామెడీ ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తుంది.ఇక బాలీవుడ్‌లోనూ జాంబీ జోనర్ జోరు భారీగా పెరిగింది. స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం -ప్రళయ్- కూడా ఇదే కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. భారీ బడ్జెట్‌తో హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వాల్యూస్‌తో తెరకెక్కుతున్న చిత్రం బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. రణ్‌వీర్ సింగ్ లాంటి స్టార్ హీరో ఈ జోనర్‌లో నటిస్తుండటంతో సినిమాపై జాతీయ స్థాయిలో భారీ హైప్ క్రియేట్ అవుతుంది.మరోవైపు కోలీవుడ్‌లోనూ ఈ ట్రెండ్ జోరుగా కొనసాగుతోంది. ప్రభుదేవా .. నవ్వుల రారాజు వడివేలు ప్రధాన తారాగణంగా తెరకెక్కుతున్న -బ్యాంగ్ బ్యాంగ్- సినిమా కూడా జాంబీ కామెడీ నేపథ్యంలోనే రూపొందుతోంది. ఇద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న హర్రర్-కామెడీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులకు అంతులేని నవ్వులను పంచడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఒకరికొకరు పూర్తిగా భిన్నమైన శైలి కలిగిన ఇద్దరు దిగ్గజాలు జాంబీలతో చేసే అల్లరి థియేటర్లలో నవ్వుల పువ్వులు పూయించడం పక్కా.మొత్తంగా ప్రశాంత్ వర్మ విత్తిన జాంబీ రెడ్డి చిన్న మొక్క నేడు ఇండియన్ సినిమా పరిశ్రమలో పెద్ద వృక్షలా ఎదిగుతోందన్నది కాదనలేని నిజం. రొటీన్ లవ్‌స్టోరీలు, యాక్షన్ చిత్రాలకే పరిమితం కాకుండా ఇలాంటి ప్రయోగాత్మక జాంబీ కాన్సెప్ట్‌లను ప్రేక్షకులు ఆదరిస్తుండటం శు భపరిణామం. రాబోయే రోజుల్లో భారతీయ తెరపై జాంబీ సినిమాల జోరు మరింత పెరిగి మరిన్ని అద్భుతమైన చిత్రాలు వచ్చే అవకాశం ఉంది.

# శ్రీలంకతో రెండో టెస్టుకు ముందు కుల్దీప్‌కు గంభీర్ కీలక సూచన!

- వికెట్ల కోసం తొందరపడొద్దని కుల్దీప్‌కు గంభీర్ సూచన
- మంచి స్పెల్‌పై దృష్టి పెట్టాలని సూచించిన గంభీర్
- 20 వికెట్లు తీయగల బౌలింగ్ దళమే లక్ష్యమని వివరణ
- పరిస్థితులకు తగ్గట్టే తుది జట్టును ఎంచుకుంటామని స్పష్టీకరణ
- కుల్దీప్‌ను అత్యంత ప్రమాదకర బౌలర్‌గా అభివర్ణన



వికెట్లు తీయాలనే ఆత్రుతతో బౌలింగ్ చేయకుండా మంచి స్పెల్ వేయడంపైనే దృష్టి పెట్టాలని భారత హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్.. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు సూచించాడు. శ్రీలంకతో ఆదివారం ప్రారంభమయ్యే రెండో టెస్టు నేపథ్యంలో జట్టు కూర్పుపై చర్చ జరుగుతున్న వేళ ఈ వ్యాఖ్యలు చేశాడు.

గాలేలో జరిగిన తొలి టెస్టులో కుల్దీప్ ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. దీంతో రెండో టెస్టులో అతడి స్థానం గురించి చర్చ జరుగుతోంది. జట్టులో సారాంశ్ జైన్ రూపంలో మరో స్పిన్ ఆల్‌రౌండర్ కూడా అందుబాటులో ఉన్నాడు.అయితే టెస్టు మ్యాచ్ గెలవాలంటే 20 వికెట్లు తీయగల అత్యుత్తమ బౌలింగ్ దళాన్ని ఎంపిక చేస్తామని గంభీర్ స్పష్టం చేశాడు. పరిస్థితులను బట్టి తుది జట్టును నిర్ణయిస్తామని చెప్పాడు.కుల్దీప్‌తో తన చర్చల గురించి మాట్లాడుతూ.. వికెట్ల కోసం అత్యాశ పడకుండా మంచి స్పెల్ వేయడంపైనే దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిపాడు. రిస్ట్ స్పిన్నర్లు వికెట్ల కోసం ఆత్రుత పడితే బౌలింగ్‌పై నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటుందని అన్నాడు.కుల్దీప్ సామర్థ్యంపై తమకు పూర్తి నమ్మకం ఉందని గంభీర్ పేర్కొన్నాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా అతడు ప్రమాదకర బౌలర్‌గా మారగలడని తెలిపాడు. అయితే పరిస్థితులకు అనుగుణంగా ఫలితం ఇచ్చే బౌలింగ్ దళానికే ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశాడు.గాలే టెస్టు పిచ్‌పై కూడా గంభీర్ సంతృప్తి వ్యక్తం చేశాడు. స్పిన్నర్లు, పేసర్లు, బ్యాటర్లకు ఆ పిచ్ సహకరించిందని అన్నాడు. ఐదు రోజుల పాటు తీవ్రంగా శ్రమిస్తేనే టెస్టు మ్యాచ్ గెలవగలమని చెప్పాడు.అలాగే ఐదుగురు ప్రధాన బౌలర్లతో ఆడటం జట్టుకు వ్యూహాత్మకంగా ప్రయోజనకరమని పేర్కొన్నాడు. ఫ్లాట్ పిచ్‌లపై బౌలర్లను రొటేట్ చేసేందుకు ఇది అవకాశం ఇస్తుందని తెలిపాడు.

# 15 ఏళ్ల వైభవ్.. టెస్టుల్లోనూ అదరగొడతాడా? ద్రవిడ్ ఏమన్నాడంటే!

- వైభవ్ టెస్టు క్రికెట్‌కు కొత్త ఊపు తేగలడన్న ద్రవిడ్
- దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ తరపున ఆడనున్న వైభవ్
- రెడ్‌బాల్ క్రికెట్‌లో వైభవ్‌కు మరింత అనుభవం అవసరమన్న ద్రవిడ్
- వైభవ్ ఎదుగుదలపై ఓపిక అవసరమని ద్రవిడ్ సూచన
- సెప్టెంబరులో ఆస్ట్రేలియా-ఏతో ఇండియా-ఏ అనధికారిక టెస్టులు



టీ20 క్రికెట్‌లో సంచలనం సృష్టిస్తున్న వైభవ్ సూర్యవంశీ.. భవిష్యత్తులో టెస్టు క్రికెట్‌కు కొత్త ఉత్సాహాన్ని తీసుకురాగలడని భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ అన్నాడు. అయితే 15 ఏళ్ల వైభవ్ ఎదుగుదలను జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించాడు. అతడికి తగినంత సమయం, అనుభవం ఇవ్వాలని చెప్పాడు.వైభవ్ దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ తరఫున ఆడనున్నాడు. వైట్‌బాల్ క్రికెట్‌లో ఇప్పటికే సత్తా చాటిన అతడికి.. రెడ్‌బాల్ క్రికెట్‌లో నిలకడ సాధించేందుకు ఇది కీలక అవకాశం. 2025 ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున వైభవ్‌కు ద్రవిడ్ కోచ్‌గా వ్యవహరించాడు.వైభవ్ ఇప్పటివరకు ఎనిమిది ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. అతడి సగటు 17.25గా ఉంది. దేశవాళీ రెడ్‌బాల్ క్రికెట్‌లో ఎక్కువకాలం వరుసగా ఆడే అవకాశం అతడికి ఇప్పటివరకు పెద్దగా దక్కలేదు. దులీప్ ట్రోఫీతో ఆ లోటు తీరే అవకాశం ఉంది. సెప్టెంబరులో ఆస్ట్రేలియా-ఏతో ఇండియా-ఏ రెండు అనధికారిక టెస్టులు ఆడనుంది. ఈ మ్యాచ్‌లు కూడా వైభవ్‌కు ఉపయోగపడే అవకాశముంది.టీ20 క్రికెట్‌కు, టెస్టు క్రికెట్‌కు చాలా తేడా ఉంటుందని ద్రవిడ్ పేర్కొన్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇన్నింగ్స్‌ను నిర్మించడం, ఒత్తిడిని తట్టుకోవడం, ఎక్కువసేపు ఏకాగ్రతతో బ్యాటింగ్ చేయడం వైభవ్ నేర్చుకోవాల్సి ఉంటుందని చెప్పాడు.వైభవ్ సూర్యవంశీకి ఇంకా 15 ఏళ్లేనని ద్రవిడ్ గుర్తు చేశాడు. అతడి కెరీర్‌లో విజయాలతో పాటు వైఫల్యాలు కూడా వస్తాయని పేర్కొన్నాడు. అందుకే అతడిపై ఓపికతో వ్యవహరించాలని సూచించాడు.టెస్టు క్రికెట్ మనుగడ సాగించాలన్నా, ఎదగాలన్నా మూడు ఫార్మాట్లలో ఆడగల ఆటగాళ్లు అవసరమని ద్రవిడ్ అన్నాడు. వైభవ్ భవిష్యత్తులో భారత్ తరఫున టెస్టు ఆటగాడిగా ఎదిగితే ప్రపంచ క్రికెట్‌కే అది ఆసక్తికర పరిణామమవుతుందని పేర్కొన్నాడు.

# 'లైక్స్, వ్యూస్ కాదు.. ట్రోఫీలే ముఖ్యం'.. గంభీర్ కీలక వ్యాఖ్యలు

- టెస్టుల్లో భారత్ ఇబ్బందుల్లో లేదన్న గంభీర్
- ర్యాంకింగ్స్ కంటే ట్రోఫీలు గెలవడమే లక్ష్యమని స్పష్టీకరణ
- శ్రీలంకపై భారత్ 1-0తో సిరీస్‌లో ఆధిక్యం
- గిల్, పడిక్కల్, సుతార్‌పై గంభీర్ విశ్వాసం
- 20 వికెట్లు తీసే బౌలింగ్ కూర్పే కీలకమని వెల్లడి



భారత టెస్టు జట్టు కష్టాల్లో ఉందన్న వాదనను హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తోసిపుచ్చారు. ఇటీవల ఎదురైన పరాజయాలను పతనంగా చూడొద్దని అన్నారు. జట్టు ప్రస్తుతం మార్పుల దశలో ఉందని స్పష్టం చేశాడు. తనకు ర్యాంకింగ్స్, సోషల్ మీడియాలో లైక్స్, వ్యూస్ హడావుడి కంటే ట్రోఫీలు గెలవడమే ముఖ్యమని చెప్పాడు.శ్రీలంకతో రెండో టెస్టుకు భారత్ సిద్ధమవుతోంది. గాలేలో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది. కొలంబో టెస్టుతో సిరీస్ విజేత ఎవరో తేలనుంది.రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత భారత జట్టు భారీ మార్పులకు లోనైంది. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో స్వదేశీ సిరీస్‌ల్లో ఓటములు ఎదురయ్యాయి. ఆస్ట్రేలియా పర్యటనలోనూ భారత్‌కు నిరాశే ఎదురైంది. అయినా జట్టు గాడి తప్పిందని అనుకోవద్దని గంభీర్ అన్నాడు."మేం టెస్టు క్రికెట్‌లో ఇబ్బంది పడటం లేదు. ఇంగ్లండ్ పర్యటన తర్వాత సహేతుకమైన క్రికెట్ ఆడుతున్నాం. నా పని ట్రోఫీలు గెలవడం. నేను పట్టించుకునేది అదే" అని గంభీర్ స్పష్టం చేశాడు.కొత్త తరం ఆటగాళ్లపై గంభీర్ నమ్మకం వ్యక్తం చేశాడు. కొలంబోలో 20 వికెట్లు తీసే అత్యుత్తమ బౌలింగ్ కూర్పుతో బరిలోకి దిగుతామని చెప్పాడు. కుల్దీప్ యాదవ్ మంచి బౌలర్ అని పేర్కొన్నాడు. ఒకటి రెండు మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా ఆటగాళ్లను పక్కన పెట్టకూడదన్నాడు. క్రికెట్‌లో ఎత్తుపల్లాలు సహజమని, ఆటగాళ్లకు మరింత సమయం ఇవ్వాలని సూచించాడు. గిల్, పడిక్కల్, సుతార్‌లపై గంభీర్ విశ్వాసం ప్రకటించాడు.

మూడు టెస్టుల సిరీస్‌లకు గంభీర్ మద్దతు తెలిపాడు. తొలి టెస్టులో ఓడిన జట్టుకు పుంజుకునే అవకాశం మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఎక్కువగా ఉంటుందని చెప్పాడు. శ్రీలంకతో ప్రస్తుత సిరీస్ రెండు టెస్టులకే పరిమితం కావడంతో రెండో మ్యాచ్ ఫలితమే సిరీస్‌ను నిర్ణయించనుంది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776